## ధాన్యం రవాణాకు అదనపు వాహనాలు



వివరాలు మెయిన్‌లో...

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
శనివారం | 30 మే, 2026 | పేజీలు :08

# ధాన్యం కొనుగోళ్ల వేగం పెంచాలి



### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు

**ప్రజాపక్షం/భూపాలపల్లి :**అకాల వర్షాల దృష్ట్యా ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. శుక్రవారం ఐడిఓసీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ధాన్యం కొనుగోళ్ల పై జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పి సిరిశెట్టి సంకీర్త్ తో కలిసి పౌర సరఫరాలు, రవాణా, వ్యవసాయ, సహకార, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో పాటు మిల్లర్లు, ట్రాన్స్ పోర్టు కాంట్రాక్టర్లు, పిఎసిఎస్ సీఈఓ లు, ఏపిఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ, మక్కల కొనుగోలులో రాష్ట్రంలో మన జిల్లా మొదటి స్థానంలో ఉన్నదని, అదే స్ఫూర్తితో ధాన్యం కొనుగోళ్లలో సైతం వేగం పెంచాలని సూచించారు. అకాల వర్షాల వల్ల ధాన్యం తడవకుండా కట్టు దిట్టమైన చర్యలు చేపట్టాలని అన్నారం కొనుగోలు కేంద్రాలలో రైతులకు తప్పనిసరిగా ట్రక్ షీట్ ఇవ్వాలని, ధాన్యం కాంటా జరిపిన వెంటనే ట్యాబ్ ఎంట్రి కచ్చితంగా చేయాలని తెలిపారు. ఐరిస్ పద్ధతిని తొలగించి ఓటిపి ద్వారా ధాన్యం కొనుగోలు చేపట్టాలని రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని మరో వారంలోగా కొనుగోలు పూర్తి చేయాలని సూచించారు. జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు జరిగిన వెంటనే రైతులకు ట్రక్ షీట్ ఇవ్వాలని ఆదేశించారు. ట్రక్ షీట్ ఇవ్వకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రాలలో ఖచ్చితమైన లక్ష్యం ద్వారా ధాన్యం కొనుగోలులో వేగం పెంచాలని స్పష్టం చేశారు. పిఎసిఎస్ సీఈఓలు, ఏపిఎంలు క్షేత్రస్థాయిలో పరిశీలించి కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు ప్రతి రోజు కచ్చితంగా 8 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు జరిగేలా చూడాలని ఆదేశించారు. లారీలు కొరత ఉంటే ట్రాక్టర్లు ద్వారా మిల్లులకు తరలించాలని అకాల వర్షాలు వల్ల ధాన్యం తడవకుండా ఎత్తైన ప్రదేశాలలో నిల్వ ఉంచాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పౌరసరఫరాలు, సంస్థ రవాణా, డిఆర్డిఓ, సహకార శాఖల అధికారులు, మిల్లర్లు పిఎసిఎస్ సీఈవోలు, ఏపీఎం లు పాల్గొన్నారు.

# మిషన్ భగీరథ పైప్‌లైన్ లీక్

### వృథాగా పారుతున్న తాగునీరు



**ప్రజాపక్షం/నెక్కొండ:**ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం అమలు చేస్తున్న మిషన్ భగీరథ పథకంలో నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోంది వరంగల్ జిల్లా నెక్కొండ మండల కేంద్రానికి సమీపంలోని నర్సంపేట ప్రధాన రహదారిపై హనుమాన్ టెంపుల్ ఎదురుగా మిషన్ భగీరథ పైప్‌లైన్‌ను ప్రమాదవశాత్తు లీక్ కావడంతో తాగునీరు భారీగా వృథాగా పారిపోతోంది. ఎండలు తీవ్రంగా మండుతున్న ఈ సమయంలో విలువైన మంచి నీరు రోడ్డుపై ప్రవహిస్తుండడం స్థానికులను కలిచివేస్తోంది. మరోవైపు రహదారిపై ప్రయాణించే బాటసారులు మాత్రం ఈ చల్లని నీటిని చూసి కాసేపు ఆగి సేద తీరుతున్నారు. కొందరు ముఖం కడుక్కుంటూ ఉపశమనం పొందుతుండగా, పశుపక్షాదులు కూడా ఈ నీటిని ఆశ్రయిస్తున్న దృశ్యాలు కనిపిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో చాలా చోట్ల తాగు నీటి కోసం ప్రజలు ఇబ్బందులు పడుతున్న వేళ, ఇలా వేల లీటర్ల నీరు వృథాగా పారిపోవడంపై ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి లీకేజిని అరికట్టి నీటి వృథాను నివారించాలని స్థానికులు కోరుతున్నారు.

# రెండు పడకల గదుల సముదాయంలో మౌలిక వసతులు: కలెక్టర్



**ప్రజాపక్ష/కమలాపూర్:**రెండు పడకల గదుల ఇళ్ళ సముదాయంలో తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ, తదితర మౌళిక వసతులను కల్పించాలని జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కమలాపూర్ మండలం గూడూరు, కమలాపూర్ లో నిర్మించిన రెండు పడక గదుల ఇళ్ళ సముదాయాలను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ.... మరమ్మత్తు పనులు త్వరగా పూర్తిచేయాలని, లబ్ధిదారులకు త్వరగా పంపిణీ చేసే విధంగా మౌళిక వసతులు కల్పించాలని అన్నారు. ఈ సందర్భంగా గూడూరు, కమలాపూర్ సర్పంచులు బండి వనజ కళాధర్, పబ్బు సతీష్, జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిద్ధార్థ నాయక్, డిఆర్‌డివో మేన శ్రీను, ఎంపిడివో బాబు, తహాశీల్దార్ సురేష్ కుమార్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

**ఉపాధీ హామీ కూలీలతో క్షేత్రస్థాయిలో సౌకర్యాల ఆరా...**

ఉపాధి హామీ పనులకు ప్రతిరోజు ఎంత మంది కూలీలు వస్తున్నారని అధికారులను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అడిగి తెలుసుకున్నారు. ఉపాధీ హామీ పని ప్రదేశం వద్ద పనిచేస్తున్న ఉపాధీ హామీ కూలీలతో క్షేత్రస్థాయిలో కల్పిస్తున్న సౌకర్యాల గురించి ఆరా తీశారు. కూలీలు క్రమం తప్పకుండా వస్తున్నారా, మహిళలను స్వయం సహాయక సంఘాలలో సభ్యులుగా ఉన్నారా అని, రుణాలు తీసుకుంటే సకాలంలో కడుతున్నారా అని కలెక్టర్ ఉపాధీ హామీ కూలీలతో మాట్లాడారు. ఈజీఎస్ పనులు చేస్తుండగా ఫోటోలు దిగే సమయంలో ఏవైనా ఇబ్బందులు ఎదురవుతున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అక్కడ ఏర్పాటు చేసిన మౌళిక వసతులపై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఉపాధీ హామీ పనులు వేగవంతంగా జరుగుతుండడం పై డిఆర్‌డివో మేన శ్రీను, కమలాపూర్ ఎంపిడివో గుండె బాబుఉ, ఈజీఎస్ సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రమ నాగరాజు, తహశీల్దార్ సురేష్ కుమార్, ఈజీఎస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



నవరత్న మాలా హారతి చూస్తుంటే హిమాలయాల్లో ఉన్నట్లు ఉంది

వివరాలు 2లో...

# నవరత్న మాలా హారతి చూస్తుంటే హిమాలయాల్లో ఉన్నట్లు ఉంది

### శారదా పీఠం పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి

**ప్రజాపక్షం/భూపాలపల్లి/కాళేశ్వరం:**జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో కొనసాగుతున్న సరస్వతి అంత్య పుష్కరాలలో భాగంగా గురువారం ఎనిమిదవ రోజు సాయంత్రం రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు త్రివేణి సంగమం వద్ద నిర్వహించిన సరస్వతి నవరత్న మాలా హారతిని విశాఖ పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ, మాజీ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ధార్మిక సలహాదారు గోవింద హరిలతో కలిసి ఆద్యంతం వీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ, కాళేశ్వర ముక్తేశ్వర స్వామి ప్రాంగణంలో రాష్ట్ర ప్రభుత్వం చేసిన ఏర్పాట్లలో భాగంగా సరస్వతి అంత్య పుష్కరాలలో పుష్కర స్నానం



ఆచరించేందుకు, క్షేత్రంలో మనందరికి ఆశీస్సులు ఇవ్వడానికి విచ్చేసిన బ్రహ్మశ్రీ స్వరూపనంద స్వామికి అందరి తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి అందరికి హృదయపూర్వకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం విశాఖ పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి స్వామీజీ మాట్లాడుతూ, కరుణాలయం నమామి భగవత్పాదం శంకరం లోక శంకరం అంటూ నవరత్న మాలా హారతిలో పాల్గొంటే హిమాలయాల్లో ఉన్నామా అనిపిస్తుందని, ఇంత అత్యద్భుతంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సరస్వతీ పుష్కరాలను గొప్పగా ఏర్పాట్లు చేసిందని కొనియాడారు. ఈప్రాంతానికి చెందిన మంత్రి శ్రీధర్ బాబు ఇంత అత్యద్భుతంగా కాశీలో హారతులు ఇచ్చే గొప్ప పండితులను రప్పించడం గొప్పగా అలంకరణ చేయడం ఇక్కడ భక్తులు ధన్యాత్ములని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కాలేశ్వరం దేవాలయాన్ని వేములవాడ వలే అభివృద్ధి చేయాలని,బాసర దేవాలయంలాగా చేయాలని సంకల్పించడం ప్రభుత్వం యొక్క గొప్పతనమని కొనియాడారు. ఈ సందర్భంగా దేవాదాయ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ, ధార్మిక సలహాదారు గోవింద హరికి, చక్కటి ఏర్పాట్లు చేసిన జిల్లా యంత్రాంగం యొక్క కృషి గొప్ప ఫలితం అని తెలిపారు. మనందరికీ ఈ రోజు చాలా గొప్ప రోజు అని పరమశివుడికి పరమప్రీతి అయిన రోజని మహాదేవుడు తాండవించిన రోజు అని పేర్కొన్నారు. త్రయోదశి సాయంత్రం మహా ప్రదోషతకాలమని పరమశివుడి కి అత్యంత ఇష్టమైన రోజన హారతిని చూడటం మన భాగ్యమని పేర్కొన్నారు. రేపు రేపు పుష్కర స్నానం చేస్తే అదృష్టం భాగ్యము కలుగుతుందని తెలిపారు. ఆ భగవతి అమ్మ గారి అనుగ్రహం ఏమో కానీ ఈ ప్రదోషకాలంలో మాస శివరాత్రి నాడు స్నానం చేయడం నాకు చాలా ఆనందంగా ఉందని తెలిపారు. మీరందరూ చాలా అదృష్టవంతులు ఎంత గొప్పగా వీక్షించారని అభినందించారు. చక్కటి ఏర్పాట్లు చేసినందుకు తెలంగాణ ప్రభుత్వాన్ని ఆశీర్వదిస్తూ అన్ని దేవాలయాలకు గొప్ప వైభవాలు తీసుకురావాలని సమాజంలో నాసికత్వంపై ఆస్తికత్వం పెరిగి భక్తి భావాలు పెరిగి ఈ భారతదేశానికి ఒక వెన్నుముకలా యువత తయారు కావాలని మనస్ఫూర్తిగా ఆశీర్వదించారు. అనంతరం పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతీ చేతుల మీదుగా మంత్రి శ్రీధర్ బాబు,కలెక్టర్ రాహుల్ శర్మను శాలువా కప్పి సన్మానం చేసారు.

## సిపిఐ ఆధ్వర్యంలో కెవైసి ప్రోగ్రాం



**ప్రజాపక్షం/భూపాలపల్లి :**కారల్ మార్క్స్ కాలనీ 24 వార్డులో వార్డ్ కౌన్సిలర్ వేముల జ్యోతి శ్రీకాంత్ ఆధ్వర్యంలో పింఛన్ లబ్ధిదారులకు కేవైసి అప్డేట్ క్యాంప్ నిర్వహించడం జరిగింది. 24వ వార్డులో ఉన్న నడవలేని అంగవైకల్యంతో బాధపడుతున్న వారి కోసం ఈ స్పెషల్ డ్రైవ్ ను నిర్వహించడం జరిగింది. ఈ క్యాంపులో సుమారు 30 మంది పింఛన్ లబ్ధిదారులు కేవైసి అప్డేట్ చేసుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ వార్డ్ అధ్యక్షులు కేవి అశోక్ గౌడ్, మాజీ కో ఆప్షన్ సభ్యులు మహమ్మద్ ఇర్ఫాన్, షాబీర్ ఖాన్, వేల్పుల మొగిలి, ఓనపాకల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

### బాధిత కుటుంబానికి అండగా కాంగ్రెస్ నాయకులు



**ప్రజాపక్షం/గూడూరు;**ముఖ్యమంత్రి సహాయ నిధి సిఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ చెక్కును గూడూరు మండల కేంద్రంలో బాధిత కుటుంబానికి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు కత్తి స్వామి గూడూరు మాజీ ఎంపిపి నూనవత్ రమేష్ నాయక్ అందజేశారు.మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరాం నాయక్ సహకారంతో రాములు తండాకు చెందిన తేజావత్ నరేష్‌కు రూ 48.500 విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేశారు. ఈసందర్భంగా రమేష్ నాయక్ మాట్లాడుతూ ఆ పదలో ఉన్న పేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి ఎంతో ఉపయోగపడుతోందని తెలిపా రు.ప్రజలకు అవసరమైన సమయంలో ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో హెచ్ శివ దారావత్ మంజ నూనవత్ శ్రీకాంత్ మాజీ వార్డు సభ్యులు గోపగాని యాదగిరి దోమ సతీష్ పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



### సిఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రైతులకు భరోసా✻ ఎమ్మెల్యే మురళీ నాయక్ సూచనలతో బ్రాహ్మణపల్లి ఏపూర్ గ్రామాల్లో ఘనంగా క్షీరాభిషేకాలు

**ప్రజాపక్షం/గూడూరు;** రాష్ట్రంలో రైతు సంక్షేమాన్ని ప్రధాన ధ్యేయంగా తీసుకుని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలకు రైతుల నుంచి విశేష స్పందన లభిస్తోందని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకలు బుడిగె సతీష్ గౌడ్ అన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి డబ్బులను నేరుగా రైతుల ఖాతాల్లో జమ చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలంలోని బ్రాహ్మణపల్లి ఏపూర్ గ్రామాల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు ఘనంగా క్షీరాభిషేకం నిర్వహించారు.ఈకార్యక్రమం ఎమ్మెల్యే మురళి నాయక్ సూచనల మేరకు జరిగింది. ఈసందర్భంగా బుడిగె సతీష్ గౌడ్ మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతుల కష్టాలను దగ్గరుండి అర్థం చేసుకుని రైతు సమస్యల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి సారిస్తున్నారని తెలిపారు.ధాన్యం కొనుగోలు ప్రక్కియలో ఎక్కడా రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా గన్నీ సంచులు రవాణా వాహనాలు సిబ్బంది తదితర అన్ని సౌకర్యాలను ప్రభుత్వం సమకూర్చడం అభినందనీయమని అన్నారు. రైతు పండించిన ప్రతి గింజను కొనుగోలు చేయాడానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. దేశంలోనే రైతు పక్షపాత ప్రభుత్వంగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తోందని రైతుల కష్టానికి గౌరవం ఇచ్చే నాయకడు సీఎం రేవంత్‌రెడ్డి అని కొనియాడారు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రైతుల్లో నమ్మకం పెంచుతున్నారు అన్నారు రైతు సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుటున్న చారిత్రాత్మక నిర్ణయాలను చూసి ప్రతిపక్షాలు జీర్ణంచుకోలేక తప్పుడు ప్రచారాలకు దిగుతున్నాయని విమర్శించారు. కానీ ప్రజలు వాస్తవాలను గమనిస్తూన్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై పూర్తి విశ్వాసంతో ఉన్నారని పేర్కోన్నారు. మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళి నాయక్ నియూజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేస్తున్న నాయకుడని బుడిగె సతీష్ గౌడ్ ప్రశంసించారు. గ్రామ గ్రామాన పర్యటిస్తూ రైతులు ప్రజల సమస్యలను ప్రత్యక్షంగా తెలుసుకుని వెంటనే పరిష్కార చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. రైతు బాంధవుడిగా ఎమ్మెల్యే మురళి నాయక్ ప్రజల మన్ననలు పోందుతున్నారని అన్నారు.ఈకార్యక్రమంలో మాజీ సర్పంచ్ పూనెం యాకయ్య బత్తుల రామన్న మేరుగు మధు రెండు గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

## ఆదివాసీ హక్కుల కోసం పోరాటం కొనసాగాలి

### సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ గూడూరు డివిజన్ కార్యదర్శిసూర్యం

**ప్రజాపక్షం/గూడూరు;**కాచనపల్లి అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని వారు కలగన్న సమాజ సాధన కోసం ప్రజలు ఐక్యంగా పోరాడాలని సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ గూడూరు డివిజన్ కార్యదర్శి సూర్యం పిలుపునిచ్చారు.కొత్తగూడ మండల కేంద్రంలోని పాలడుగు కృష్ణస్మారక భవనంలో శుక్రవారం నిర్వహించిన కాచనపల్లి అమరవీరుల సంస్మరణ సభలో ఆయన పాల్గొని అమరవీరుల చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈసందర్భంగా సూర్యం మాట్లాడుతూ పీడిత ప్రజల విముక్తి ప్రజా సమస్యల పరిష్కారం కోసం కాచనపల్లి అమరవీరులు చేసిన త్యాగాలు ఎప్పటికీ వృథా కావని అన్నారు.ప్రస్తుత పరిస్థితుల్లో ఆదివాసీల హక్కులు కాలరాస్తున్నాయని ప్రభుత్వం అమలు చేయాల్సిన చట్టాలను నిర్లక్ష్యం చేస్తోందని ఆరోపించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో 1/70



చట్టాన్ని కఠనంగా అమలు చేయాలని కొత్తగూడ గంగారం మండలాల ప్రజలకు సాగునీటి సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. పోడు భూముల సాధన కోసం అనేక మంది అమరవీరులు తమ ప్రాణాలను ఆర్పించారని వారి ఆశయాల సాధన కోసం ఉద్యమాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా నాయకలు బుర్కా వెంకటయ్య మండల ప్రధాన కార్యదర్శి బుర్కా బుచ్చిరాములు పీవైఎల్ మండల ప్రధాన కార్యదర్శి తాళ్లపల్లి ప్రభాకర్ జామ్లా పుర్ణచందర్ రాజా బాబీ గట్టి సతీష్ నగేష్ సదయ్య సుదర్శన్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## ఎండల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: కలెక్టర్

**ప్రజాపక్షం/భూపాలపల్లి :**జిల్లాలో నమోదు అవుతున్న అధిక ఉష్ణోగ్రతల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ సూచించారు. జిల్లాలో తీవ్ర ఎండలు నమోదవుతున్నాయని, నిన్న జిల్లా గరిష్ట ఉష్ణోగ్రత 46.2 C నమోదైందని తెలిపారు. వాతావరణ శాఖ ముందస్తు సూచనల ప్రకారం రాబోయే మూడు రోజుల్లో కూడా ఉష్ణోగ్రతలు అధికంగా ఉండే అవకాశం ఉందని జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. జిల్లాలో తీవ్రమైన వేడి పరిస్థితులు కొనసాగుతున్నందున ప్రజలు అత్యంత జాగ్రత్తలు పాటించాలన్నారు.

**ప్రజలకు సూచనలు**

మధ్యాహ్నం 11 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు బయటకు వెళ్లడం తగ్గించాలి.ఎక్కువగా నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు వంటి ద్రవాలను తీసుకోవాలి. తేలికపాటి, ఖద్దరు దుస్తులు ధరించాలి. వృద్ధులు, పిల్లలు, గర్భిణీలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలి. తలనొప్పి, అలసట, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ఆసుపత్రిని సంప్రదించి వైద్య సేవలు పొందాలి. వైద్యాధికారులు తగిన వైద్య సదుపాయాలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రజలు అధికారుల సూచనలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు.

## నాలుగేళ్ల నిరీక్షణకు భూ పరిష్కారం

**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండలంలోని పోచన్నపేట గ్రామానికి చెందిన రైతు శ్రీపతి మల్లయ్య భూ వివాదానికి నాలుగేళ్ల తర్వాత పరిష్కారం లభించింది. వంశపారంపర్యంగా సాగు చేస్తున్న భూమిని రియల్ ఎస్టేట్ వెంచర్‌లో కలపాలంటూ కొందరు ఇబ్బందులకు గురి చేశారని ఆయన ఆరోపించారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా కోర్టు ఆదేశాల మేరకు అధికారులు విచారణ చేపట్టారు. భూమికి సంబంధించిన సర్వే నంబర్లు 422, 423లలో పాస్ పుస్తకాలు, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం మల్లయ్య హక్కులను ధృవీకరించి సరైన ఆధారాలు లేని ప్రత్యర్థుల పాస్ పుస్తకాలను రద్దు చేసినట్లు తెలిపారు. దీంతో తమకు శాశ్వత పరిష్కారం లభించిందని, న్యాయం చేసిన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపినట్లు మల్లయ్య తెలిపారు.

## తెలంగాణ ఉద్యమకారుల మండల కమిటీ ప్రకటన

**ప్రజాపక్షం/లింగాలఘణపురం:**ఉమ్మడి వరంగల్ జిల్లా జనగామ జిల్లాలోని, తెలంగాణ ఉద్యమకారుల మండల కమిటీ ప్రకటనను అధ్యక్షుడు గుజ్జుక రాజు జిల్లా కన్వీనర్ శ్రీనివాస్, బాలకృష్ణ, కమిటీ సభ్యులకు, సర్పంచ్ ఎడ్ల లావణ్య రాజులకు వారు నియామక పత్రాన్ని అందజేశారు. మండల అధ్యక్షులుగా, ఏదునూరి వీరన్న, ప్రధాన కార్యదర్శిగా, చౌదర పల్లి శేఖర్, గౌరవ అధ్యక్షుడిగా దుంబాల భాస్కర్ రెడ్డి కోశాధికారిగా బండ చంద్రమౌళి గౌరవాధ్యక్షుడిగా బస్వ గాని శ్రీనివాస్ గౌడ్ కార్యదర్శిగా మడగం నర్సయ్య ఉపాధ్యక్షుడిగా కాసర్ల సుధీర్ కుమార్, రమ్య కుమార్, నారగాని లింగమూర్తి, సలహాదారులు సంగి పాపయ్య, కార్యవర్గ సభ్యులుగా మంద రాంరెడ్డి, రేగు శ్రీశైలం, చల్ల వెంకట్ రెడ్డి, మద్దూరి శీను, ఆగ రాజు, గైని ప్రదీప్, ఎన్నికయ్యారు. స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్, నందగిరి రజినీకాంత్ అడ్వకేట్, జిల్లా కన్వీనర్ కడింగుల బాలకృష్ణ, జనగామ మండల అధ్యక్షుడు బొల్లం భాస్కర్ పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గౌరీశంకర్

ప్రజాపక్షం/తొర్రూరు : పట్టణ కేంద్రానికి చెందిన ప్రొద్దుటూరి గౌరీ శంకర్‌ను ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు అమరావతి లక్ష్మీ నారాయణ తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర కార్యాలయంలో ప్రకటించి నియామక పత్రాన్ని గౌరీ శంకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ముప్పై ఏళ్లుగా ఆర్యవైశ్య సంఘంలో ఉంటూ పలు సేవా కార్యక్రమాలు చేపడుతూ సంఘం అభివృద్ధికి, ఆర్యవైశ్యులకు రాజకీయ చైతన్యం కల్పించిన గౌరీ శంకర్ సేవలను గుర్తించి ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించడం జరిగిందన్నారు. ఈ పదవి రెండేళ్లు ఉంటుందని తెలిపారు. అనంతరం గౌరీశంకర్ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మరోసారి నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు అమరావతి లక్ష్మీ నారాయణకు, రాష్ట్ర ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులకు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఆర్యవైశ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

# ఆర్యభట్ట స్కూల్‌లో సిబిఎస్‌ఇ సిలబస్‌లో అడ్మిషన్లు ప్రారంభం

ప్రజాపక్షం/తొర్రూరు : డివిజన్ కేంద్రంలోని ఆర్యభట్ట స్కూల్‌లో మొదటిసారిగా సిబిఎస్‌ఇ సిలబస్‌లో అడ్మిషన్లు ప్రారంభమైనట్లు పాఠశాల కరస్పాండెంట్ నెలకుర్తి మధుకర్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ క్రమశిక్షణ, పట్టుదలతో కూడిన విద్యను అందిస్తున్న అతిపెద్ద పాఠశాలగా గుర్తింపు పొందిన ఆర్యభట్ట స్కూల్‌కు సిబిఎస్‌ఇ అనుమతి లభించిందని అన్నారు. ఈ విద్యా సంవత్సరం నుంచే సిబిఎస్‌ఇ సిలబస్‌తో కూడిన విద్యను అందిస్తున్నామని చెప్పారు. ఎల్‌కెజి నుంచి పదవ తరగతి వరకు అడ్మిషన్లు తీసుకుంటున్నట్లు తెలిపారు. హాస్టల్‌లో అడ్మిషన్లు పొందే విద్యార్థులకు ప్రత్యేక మేనేజ్‌మెంట్ ఉంటుందని, పాఠశాలకు, హాస్టల్‌కు ఎలాంటి సంబంధం ఉండదని, కావున హాస్టల్ విద్యార్థుల తల్లిదండ్రులు హాస్టల్ మేనేజ్‌మెంట్ వారిని సంప్రదించి అడ్మిషన్లు పొందాలన్నారు. ఈ సమావేశంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# చిరు వ్యాపారులను ఆదుకోవాలి

ప్రజాపక్షం/ఖిలా వరంగల్:ప్రభుత్వ పరంగా చిరు వ్యాపారులను ఆదుకోవాలని సంఘం అధ్యక్షుడు గజ్జల లింగమూర్తి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వరంగల్ నగరంలోని చిరు వ్యాపారస్తుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు గజ్జల లింగమూర్తి మాట్లాడుతూ వరంగల్ హెడ్ పోస్టాఫీస్ పరిధిలో రోడ్డుకు ఇరుపక్కల చిన్న చిన్న వ్యాపారాలు చేసుకుంటున్న వారిని దౌర్జన్యంగా తొలగించడం సరికాదని వారి బతుకులకు భద్రత లేదని రోడ్డుకు ఇరు ప్రక్కల చిన్న చిన్న వ్యాపారాలు చేస్తూ ఎవ్వరిపై ఆధార పడకుండా ఎండకు వానకు చలిని లెక్క చేయకుండా కుటుంబ పోషణకై ఆరాటపడుతూ బతుకుతున్నారు. జీవనోపాధి కోల్పోయినారు. కాబట్టి ప్రభుత్వపరంగా సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం సభ్యులు ఎం అరుణ, సరోజన, శోభ, రాజేశ్వరి, స్రవంతి, లక్ష్మి, స్వప్న, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

# మంత్రి కొండా సురేఖ మురళీధర్ రావు దంపతుల వివాహ మహోత్సవం



ప్రజాపక్షం/ఖిలా వరంగల్:మంత్రి కొండా సురేఖ మురళీధర్ రావు దంపతుల వివాహ మహోత్సవం సందర్భంగా నర్సంపేట రోడ్‌లోని శ్రీ కనుకదుర్గ మాత దేవాలయంలో టిపిసిసి కార్యదర్శి మీసాల ప్రకాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు అర్చనలు భక్తులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీసాల ప్రకాష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అర్చనలు, భక్తులకు పండ్ల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మీసాల ప్రకాష్ మాట్లాడుతూ ఆదర్శ దంపతులు జయ హృదయ నేతల రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ మురళీధర్‌రావులకు శుభాకాంక్షలు తెలిఆపరు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కొండా దంపతుల అభిమానులు దేవాలయాల్లో పూజలు, చర్చిలలో, మసీదులలో గురుద్వారాల్లో ప్రార్థనలు పెద్దయెత్తున చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ జారతి రమేష్, కంటెస్టెడ్ కార్పొరేటర్ క్యాతం రవీందర్, స్టేషన్ రోడ్డు ఆటో యూనియన్ ప్రెసిడెంట్ పప్పు వేణు, ఎర్ర రవి, కాంగ్రెస్ నాయకులు సందెల లాజర్, జంగం ప్రభాకర్, ఎర్రం కమల్, పోలేపాక విశాల్ బాబు, బూర మహేందర్, మిట్టపల్లి సాంబయ్య, బల్ల సదానందం, సర్దార్ జస్వీర్ సింగ్, కంచర్ల వేణు గౌడ్, నాగరాజ్, కొగిల యాకూబ్, రాజేందర్, ఠాగూర్, బజరంగ్ సింగ్ మహిళా కాంగ్రెస్ నాయకురాలు గూడ శారద, గూడ రమ్య, బూర గాయత్రి, స్వప్న, పద్మ, శ్రీదేవి, సుజాత, స్వరూప, రాణి, తదితరులు పాల్గొన్నారు.

# రౌడీ షీటర్ల పట్ల కఠినంగా వ్యవహరించండి

## వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్

ప్రజాపక్షం/హనుమకొండ : చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడుతూ, సాధారణ ప్రజలను ఇబ్బందులకు గురి చేసే విధంగా వ్యవహరించే రౌడీ షీటర్ల పట్ల అలివివేత ధోరణితో వుండాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. నెల నేర సమీక్షా సమావేశంలో భాగంగా కిట్స్ కళాశాలలో శుక్రవారం వరంగల్ పోలీస్ కమిషనర్ అధ్వర్యంలో నేర సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన పోలీస్ అధికారులు పాల్గొన్న ఈ సమావేశంలో పోలీస్ కమిషనర్ ముందుగా శాంతి భద్రతలకు సంబంధించి అంశాలను ప్రస్తావిస్తూ ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో నిర్వహించే రౌడీ షీటర్లకు నిర్వహించే కౌన్సిలింగ్ లో వంద శాతం రౌడీ షీటర్లు అందరు హాజర్ కావాలని. ప్రతి నెల ఒకమారు స్టేషన్ అధికారులు వ్యక్తిగతంగా రౌడీ షీటర్ల ఇండ్లను సందర్శించి వారిని తనిఖీ చేయాల్సి వుంటుంది. ఇదే సందర్భంగా వారి స్థితిగతులపై కూడా ఆరా తీయాలని, తనిఖీ సమయాల్లో లేని రౌడీ షీటర్ల కదలికలపై వివరాలను సేకరించాలని. నేరాల నియంత్రణలో శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా రాత్రి సమయాల్లో బెల్ట్ షాపులను మూయించాలని, అలా చేయకుంటే వారిపై కేసులు నమోదు చేయడం లేదా బైండోవర్ చేయాలని, ముఖ్యంగా నిర్ణీత సమయాల్లో షాపులను మూయించాల్సిన బాధ్యత సంబంధిత స్టేషన్ అధికారిపై వుందని. రాత్రి సమయాల్లో అధికంగా రద్దీ వుండే ప్రాంతాలను గుర్తించి అక్కడ ముమ్మరంగా పెట్రోలింగ్ నిర్వహించాలని, ఇకపై రాత్రి సమయాల్లో ఎవరైన రోడ్లపై జన్మదిన వేడుకలు జరుపుకునే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, చోరీల కట్టడికై ఇతర ప్రాంతాల నుండి వచ్చి ఇండ్లతో పాటు ఇతర వ్యాపార సంస్థల్లో పనులు చేసే వారి వివరాలతో పాటు హాస్టల్స్ నిర్వహణకు సంబంధించిన వివరాలు సైతం స్థానిక పోలీసులు సేకరించాలని.పోలీస్ కమిషనర్ అధికారులను ఆదేశించారు. అధికారుల పనతీరుపై పోలీస్ కమిషనర్ పలు సూచనలు చేస్తూ ప్రతి పోలీస్ స్టేషన్ అధికారి తప్పని సరిగా ఉదయం 9 గంటల నుండి ప్రజలకు అందుబాటులో వుండాలని, నేరస్తుల అరెస్టు విషయంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తే శాఖ పరమైన చర్యలు తప్పవని, ద్విచక్ర వాహనాల చోరీ అయితే వెంటనే దానిపై కేసు నమోదు చేయాలని, క్షేత్రస్థాయిలో పెట్రోలింగ్ వాహనాల పనితీరును అధికారులు సమీక్షా జరపాలని, మీ ఉద్యోగానికి మీరు న్యాయం చేస్తే ప్రజలకు న్యాయం చేసినట్లని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు.అనంతరం పెండింగ్ కేసులు, నేరస్తుల అరెస్టు, కేసుల్లో కొనసాగుతున్న దర్యాప్తు తీరుతెన్నులు, నేర నియంత్రణకై స్టేషన్ పరిధిలో తీసుకుంటున్న చర్యలతో పాటు, ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకుగా అధికారులు చేట్టిన చర్యలపై పోలీస్ కమిషనర్ సంబంధిత అధికారులను అడిగితెలుసుకున్నారు. ఈ సమావేశంలో డిసిపిలు అకింత్ కుమార్, దార కవిత, రాజమహేంద్ర నాయక్, అదనపు డిసిపిలు రవి, ప్రభాకర్ రావు, బాల స్వామి,సురేష్ కుమార్‌తో పాటు ఏసిపిలు, ఇన్స్‌స్పెక్టర్లు, ఎస్.ఐలు పాల్గొన్నారు.

# ప్రజల మనిషిగా మానుకోట ఎమ్మెల్యే మురళీ నాయక్

## మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లికొండ మధు

ప్రజాపక్షం/గూడూరు; మహబూబాబాద్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తూ ప్రజల కష్టసుఖాల్లో పాలుపంచుకుంటున్న నాయకుడు ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ అని గూడూరు మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొల్లికొండ మధు అన్నారు.నియోజకవర్గ ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తూ గ్రామ గ్రామాన అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్న తీరు ప్రజల్లో విశ్వాసాన్ని పెంచుతోందని పేర్కొన్నారు.ఆయన ప్రజాపక్షం తో బొల్లి కొండ మధు మాట్లాడుతూ మహబూబాబాద్ నియోజకవర్గం ఏర్పడినప్పటి నుంచి ఎంతో మంది ఎమ్మెల్యేలు వచ్చినప్పటికి ప్రజల అసలు సమస్యలను గుర్తించి పరిష్కరించే దిశగా ఇంత చిత్తశుద్ధితో పనిచేసిన నాయకుడు మురళి నాయక్ మాత్రమేనని కొనియాడారు.ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలు విస్తరణ విద్యా రంగబలోపేతం గ్రామీణ రహదారులు నిర్మాణం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పోడు భూముల సమస్యల పరిష్కారం పేదల పట్టా సమస్యలపై అసెంబ్లీతో గళమెత్తిన పోరాడిన ఘనత ఎమ్మెల్యే మురళి నాయక్ కే దక్కుతుదని అన్నారు.ప్రజల సమస్యలను కేవలం వినడమే కాకుండా వాటి పరిష్కారానికి అధికారులతో సమన్వయం చేస్తూ వేగంగా చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు.నియోజకవర్గ ప్రజలకు ఏ కష్టం వచ్చినా నేనున్నాను అనే భరోసా కల్పిస్తూ ప్రతి గ్రామానికి చేరువవుతున్న ప్రజానాయకుడు మురళి నాయక్ అని మధు పేర్కొన్నారు. అభివృద్ధి సంక్షేమం అనే రెండు చక్రాలపై మహబూబాబాద్ నియోజకవర్గాన్ని ముందుకు తీసుకెళ్తూ యువతకు ఆదర్శంగా నిలుస్తున్నారని వారు అన్నారు.గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు రోడ్లు విద్యుత్ విద్యా సదుపాయాలు రైతుల సంక్షేమం వంటి అంశాల్లో ప్రభుత్వం ద్వారా నిధులు తీసుకువచ్చిఅభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేస్తున్నారని తెలిపారు.ప్రజలకు అందుబాటులో ఉండే నాయకత్వమే నిజమైన నాయకత్వమని ఆ లక్షణాలన్నీ ఎమ్మెల్యే మురళి నాయక్‌లో స్పష్టంగా కనిపిస్తున్నాయని అన్నారు.రాబోయే రోజుల్లో కూడా నియోజకవర్గ అభివృద్ధి ఎమ్మెల్యే మరింత కృషి చేస్తారని ప్రజల ఆశీర్వాదాలతో మహబూబాబాద్‌ను రాష్ట్రంలో ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతారని బొల్లికొండ మధు విశ్వాసం వ్యక్తం చేశారు.

# తల్లిపాలతో సంపూర్ణ ఆరోగ్యం



ప్రజాపక్షం/ములుగు:తల్లిపాలతో బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని సిడిపిఒ శిరీష అన్నారు. 99రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా కౌన్సిలర్ గోనెల భరత్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సిడిపిఒ, కౌన్సిలర్లు మాట్లాడుతూ గర్భిణీ నుండి రెండు సంవత్సరాల పిల్లల అభివృద్ధి మైలు రాళ్లు, గర్భం దాల్చిన తర్వాత కడుపులో బిడ్డ ఎదుగుదలను ప్రతి నెల బరువు చూస్తూ రక్త పరీక్షలు చేయడం, వారు సమపాళ్లలో ఆహారం తీసుకోవడం, బిడ్డ పుట్టిన వెంటనే తల్లి రొమ్ము పట్టించి పసుపు రంగులో ఉడే ముర్రు పాలను పట్టించాలన్నారు. బిసిడి టీకా వేయించాలని, 6 నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే పట్టించాలని, ఆరు నెలల తర్వాత ఏడవ నెల నుండి తొమ్మిది నెలల వరకు అనుబంధ ఆహారం లిక్విడ్‌గా ఇస్తూ 9వ నెల నుండి ఘన రూపంగా పెడుతూ ఆహార పదార్థాలు అన్ని రకాలుగా ఇస్తూ ఉండాలని, బిడ్డ ఎదుగుదల పుట్టినప్పటి నుడి 3 నెలల వరకు పిల్లలు తల్లిదండ్రులను గమనించడం వారు వారి స్వరానికి స్పందించడం వస్తువులను చేతిలో పెట్టినప్పుడు పట్టుకోవడం, తలను అటు ఇటు తిప్పడం, మూడు నుండి ఆరు నెలల పిల్లలు బోర్లపడడం చేతుల మీద లేవడానికి అంబడడానికి వస్తువుల కదలికలను గమనించడం, ఏడు నెలల నుండి తొమ్మిది నెలల పిల్లలు స్వంతంగా కూర్చోవడానికి ప్రయత్నించడం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో లోకల్ అంగన్‌వాడీ టీచర్లు జె విజయలక్ష్మి , ఏ లక్ష్మి కాంతమ్మ, ఎం సుబద్ర, ఏ సుగుణ, ఎం లత, ఎం మాధవి, ఎస్ వీరలక్ష్మి, ఏ శ్యామల, హెచ్ శిరీష, తదితరులు పాల్గొన్నారు.

# మనఊరి బడి మన బాధ్యత

ప్రజాపక్షం / నడికూడ : నడికూడ మండకేంద్రంలోని బడి మన అందరిదీ దీనిని బలోపేతం చేసే బాధ్యత మనఅందరిపై ఉందని నడికూడ గ్రామసర్పంచ్ కుడ్ల మలహాల్‌రావు పిలుపునిస్తూ ,ప్రభుత్వ పాఠశాలల్లో అర్హత కలిగిన ఉపాధ్యాయులు,మధ్యాహ్న భోజనం ,ఉచిత పాఠ్యపుస్తకాలు,యూనిఫామ్,డిజిటల్ తరగతులు వంటి అన్నిసౌకర్యాలను సద్వినియోగం చేసుకోవాని కోరారు.మనఊరిబడిలో విద్యార్థుల సంఖ్యపెరిగితే మరిన్ని సౌకర్యాలు,అదనపు టీచర్ల పోస్టులు వస్తాయని దీనివలన పిల్లలకే మేలు జరుగుతుందని మనబడి మనబాధ్యత,మనపిల్లల భవిష్యత్తు అనే నినాదంతో ప్రతిజ్ఞ కృరూ ముందుకురావాలని విజ్ఞప్తి చేశారు.

# పంట వ్యర్థాలను కాల్చితే చట్టపరమైన కఠిన చర్యలు

ప్రజాపక్షం / వేలేరు : వరికొయ్యలను(పంట వ్యర్థాలను)తగల బెట్టడం వలన సారవంతమైన నేల దెబ్బతినడమే కాకుండా పర్యావరణ కాలుష్యం ఏర్పడి,భారీ అగ్ని ప్రమాదాలు సంభవిస్తాయని వేలేరు మండల వ్యవసాయశాఖ అధికారి కవిత తెలిపారు.బుధవారం వారు మాట్లాడుతూ వరికొయ్యలు కాల్చడం వలన కలిగే నష్టాలు మిత్ర జీవాలు చనిపోవడమేకాకుండా నేలలోని సేంద్రీయ కర్బనం,పంటకు మేలు చేసే బ్యాక్టీరియా మరియు వాన పాములు మంటల్లో కాలిపోతాయి,తేమతో పాటు నత్రజని,భాస్వరం వంటి ముఖ్యపోషకాలు నశించడమే కాకుండా ఆవేడికి భూమిలోని సూక్ష్మ రంధ్రాలు పూడుకుపోయి,మట్టి గట్టిపడి తరువాత దున్నడం(సాగు చేయడం) కష్టమవడమే కాకుండా భూమి నిస్సారంగా మారడం వల్ల భవిష్యత్తులో పంట దిగుబడి తగ్గిపోతుందని అన్నారు.పంట అవశేషాలు తగుల బెట్టినట్లుగా తెలిస్తే రూ,500 నుండి 2500 వరకు జరిమాన విధించడమేకాకుండా చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతోందని మండలవ్యవసాయశాఖ అధికారి కవిత తెలిపారు.

# మద్యం తాగి వాహనాలు నడిపితే జైలు శిక్ష తప్పదు

ప్రజాపక్షం/ నర్సంపేట : మద్యం సేవించి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని నర్సంపేట టౌన్ సిఐ శ్రీనివాస్ అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నర్సంపేట పట్టణంలో మద్యం తాగి వాహనాలు నడిపి డ్రంక్ డ్రైవ్ తనిఖీలలో పట్టుబడిన ఇద్దరు వ్యక్తులు జటోత్ సంపత్, కెలోత్ సంపత్‌లు నర్సంపేట అడిషనల్ జ్యూడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ గిరిధర్ ఎదుట శుక్రవారం హాజరుపర్చగా వారికి రెండు రోజుల జైలు శిక్షతో పాటు ఒక్కొక్కరికి 500 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. ఈఇద్దరిని మహబూబాబాద్ జైలు కు తరలించారు.

## బాధిత కుటుంబానికి బిఆర్ఎస్ అండ

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:**కర్లపల్లి గ్రామానికి చెందిన రసపుత్ రాజు కుమారుడు రసపుత్ పవన్ మృతితో విషాదంలో ఉన్న కుటుంబాన్ని బిఆర్ఎస్ పార్టీ నాయకులు పరామర్శించారు కాకులమర్రి లక్ష్మణ్ బాబు ఆదేశాల మేరకు బిఆర్ఎస్ జిల్లా నాయకుడు తాటి కృష్ణ మాజీ ఎంపిపిసూడి శ్రీనివాస్ రెడ్డి మండల అధ్యక్షుడు లకవత్ నర్సింహులు కలిసి బాధిత కుటుంబాన్ని కలిసి ఓదార్చారు ఈ సందర్భంగా కుటుంబ పరిస్థితిని చూసి చలించిన నాయకులు 15వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు కేవలం అర్థిక సహాయంతో సరిపెట్టకుండా భవిష్యత్తులో కూడా ఆ కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు ముఖ్యంగా పిల్లల చదువుల విషయంలో పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు అదే విధంగా కర్లపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఈక అంజిబాబు ఇటీవల అనారోగ్యానికి గురికాగా వారికి కూడా లక్ష్మణ్ బాబు 5 వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ గోవిందరావుపేట మండల మాజీ ఎంపీపీ సూడి శ్రీనివాస్ రెడ్డి గోవిందరావుపేట మండల మాజీ అధ్యక్షుడు లకావత్ నరసింహనాయక్ సర్పంచ్‌ల మాజీ అధ్యక్షుడు మోహన్ రాథోడ్ మాజీ ఎంపిటిసి లకవత్ చందులాల్ మాలోత్ గాంధీ సమ్మయ్య వెలిశాల స్వరూప ముప్వా భాను ప్రకాష్ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

## పరామర్శ

**ప్రజాపక్షం/కాటారం;**మండల కేంద్రంలోని ఇప్పల గుడానికి చెందిన దుర్గం అంకయ్య 62 అనారోగ్యంతో మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.ఈ సందర్భంగా నేతకాని సేవా ఫౌండేషన్ ప్రధాన కార్యదర్శి గంట దేవదాస్ ఆధ్వర్యలో ఫౌండేషన్ సభ్యులు మృతుడి కుటుంబాన్ని శుక్రవారం పరామర్శించారు.దశదిన కర్మ కార్యక్రమంలో భాగంగా సభ్యులు గాలి సదువలి,గోగుల రాజేష్,కొండగొర్ల రామ్‌నారాయణ,గజ్జల రాజేందర్,దుర్గం సాగర్, వంకర తదితరులు పాల్గొని మృతుడు దుర్గం అంకయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళుర్పించారు.ఈ సందర్బంగా ఫౌండేషన్ సభ్యులు మృతుడి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ అండగా ఉంటామని అన్నారు.

## జూనియర్ కళాశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ పథకం అభినందనీయం

**ప్రజాపక్షం/నెక్కొండ:**తెలంగాణ ప్రభుత్వం, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రవేశపెడుతున్న బ్రేక్ ఫాస్ట్ పథకంపై వరంగల్ జిల్లా నెక్కొండ మండల కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా యువజన కాంగ్రెస్ నాయకుడు చల్లా శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యం, విద్యాభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ పథకం అభినందనీయమని అన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదువుతున్న పేద, మధ్య తరగతి విద్యార్థులకు ఈ పథకం ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, తెలంగాణ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

# రైతుకు వ్యతిరేక విధానాలపై పోరాడుదాం




**ప్రజాపక్షం/ వరంగల్ :** మోదీ ప్రభుత్వ రైతుకు వ్యతిరేక విధానాలపై పోరాడుదాం అఖిలభారత రైతు కూలీ సంఘం (ఎఐకెఎంఎస్) ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాచర్ల బాలరాజు తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్‌లు పిలుపునిచ్చారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అమలు చేస్తున్న రైతు వ్యతిరేక విధానాలపై ఈనెల 27 నుండి 31 వరకు నిరసన కార్యక్రమాలు చేయాలని సంయుక్త కిసాన్ మోర్చా (ఎస్‌కెఎం) జాతీయ వేదిక ఇచ్చిన పిలుపు మేరకు శుక్రవారం నగరంలోని కాశిబుగ్గ అంబేద్కర్ జంక్షన్ లో కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన జిఒ ప్రతులను రైతు సంఘాల నాయకులు దగ్ధం చేశారు. ప్రధానమంత్రి మోదీ నాయకత్వంలోని ఆర్థిక వ్యవహారాల ఉప సంఘం ఈ ఖరీఫ్ సీజన్లో 14 రకాల వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధరలను ప్రకటించిందని, ఇవి పెరుగుతున్న ధరలకు అనుగుణంగా లేవని రైతు సంఘాల నాయకులు అన్నారు. 12సంవత్సరాల మోదీ ప్రభుత్వం తాము అధికారంలోకి వస్తే స్వామినాథన్ సిఫార్సుల అనుగుణంగా కనీస మద్దతు ధరలు అమలు చేస్తామని ప్రకటించి నామమాత్రపు మద్దతు ధరలు ప్రకటించిందని విమర్శించారు.కేంద్రం మొక్కజొన్నకు పది రూపాయలు, వరికి 72 రూపాయలు, పత్తికి 557 రూపాయలు మద్దతు ధర పెంపుగా ప్రకటించిందని, ఇది తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన పంట నుండి పడేసే తాలు కంటే అద్వాన్నమన్నారు. పత్తికి రూ.11, 000, వరికి రూ.3,500, మొక్కజొన్నకు రూ.3000లుగా మద్దతు ధర ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య, ఆల్ ఇండియా కిసాన్ సంఘం జిల్లా కన్వీనర్ సుధమల్ల భాస్కర్, అఖిలభారత సంయుక్త కిసాన్ సభ జిల్లా అధ్యక్షులు వల్లందాస్ కుమార్, బండి వెంకటేశ్వర్లు, బొల్లు ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## రెండు శాఖలు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలి

### బంగారు బల్యానికి 1000మెట్ల కార్యక్రం ప్రారంభం: ఎంపిడిఒ శ్రీనివాసరావు




**ప్రజాపక్షం/ నర్సంపేట :** ఐసిడిఎస్, వైద్యశాఖలు రెండు శాఖలు సమన్వయం చేసకుంటూ ముందుగు సాగాలని నర్సంపేట మండల ప్రజాపరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసరావు అన్నారు. ప్రజా పాలన ప్రగతి నివేదిక కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఐసిడిఎస్ ఆధ్వర్యంలో నర్సంపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో నర్సంపేట ప్రాజెక్టు సిడిపిఒ మధురిమ అధ్యక్షతన మహిళా భద్రత వారోత్సవాలలో భాగంగా బంగారు బాల్యానికి 1000 మెట్లు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల పరిషత్ అధికారి శ్రీనివాస్ హాజరై మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో ఉండి ప్రజలకు, ప్రభుత్వానికి వారదులుగా ఉంటూ ఐసిడిఎస్, వైద్య శాఖలు రెండు కళ్లు గా పనిచేస్తున్నాయని, ఇకముందు కూడా ఇలాగే కొనసాగించాలని తెలిపారు. తల్లి, బిడ్డల సంక్షేమానికి, ప్రతి కుటుంబంలో ఒక వ్యక్తిగా ఉంటూ సేవలు అందించాలన్నారు. రెండు శాఖలు సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగాలన్నారు. డాక్టర్ శ్రావణ్ మాట్లాడతూ ప్రతి బిడ్డ పెరుగుదలలో ఎలాంటి అపోహలు ఉన్న వెంటనే వైద్యులను సంప్రదించాలని, వ్యాధి నిరోధక టీకాలు సకాలంలో అందేవిధంగా అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు సమన్వయంతో కృషి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో అంగన్వాడి యూనియన్ రాష్ట్రఅధ్యక్షురాలు నల్లభారతి, ఏసిడిపిఓ జ్యోతి, ఐసిడిఎస్ సూపర్ వైజర్స్ అరుణ, పారిజాతం, ఝాన్సీరాణి, ఏఎన్ఎం కవిత, రాజమణి, నల్లాభారతి, రాధ, శిరీష, రమాదేవి, అంగన్వాడీ టీచర్స్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతులు విత్తనాల ఎంపికలో జాగ్రత్తలు పాటించాలి

**ప్రజాపక్షం/మహాదేవపూర్;**విత్తనాల ఎంపికలో రైతులు జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జాడి బాబు సూచించారు.శుక్రవారం మండలంలోని బొమ్మాపూర్ రైతు వేదికలో రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాల ఎంపికలో జాగ్రత్తులు పాటిస్తూ లైసెన్స్ ఉన డీలర్ల వద్ద లేబుల్ చూసి విత్తనాలు కొనుగోలు చేయాలని అన్నారు.కాటన్‌లో బిటి 3 నిషేధం దానితో జరిగే నష్టాలను వివరించారు.వరిలో 8 రకాల పంటకు బోనస్ లభిస్తుందని ఆ రకాల విత్తనాలనే డీలర్లు అందుబాటులో ఉంచాలని సూచించారు.అనంతరం వ్యవసాయ సంచాలకుడు శ్రీపాల్ మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసినప్పుడు ఖచ్చితంగా ఆయొక్క విత్తనాల ప్యాకెట్లు,బిల్లులు సీజన్ అయిపోయేంతవరకు జాగ్రత్తగా భద్రపరచాలని అన్నారు.యూరియా అధికంగా వాడడం వల్ల కలిగే నష్టాలను వివరించారు.యూరియాకు ప్రత్యామ్నాయంగా నానో యూరియా వాడాలని అన్నారు.పంట పొలాల్లో వరి కొయ్యలను కాల్చడం వల్ల భూమికి జరిగే నష్టాలతో పాటు ప్రాణాలకు ముప్పు ఉంటుందని రైతులు వరి కొయ్యలను కాల్చకుండా పర్యావరణాన్ని కాపాడాలని అన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ మండలాల వ్యవసాయ అధికారులు,రైతులు,డీలర్లు పాల్గొన్నారు.

## నాగజ్యోతికి సీతక్కపై మాట్లాడే హక్కు లేదు

### మేడారం ట్రస్టు బోర్డు చైర్మన్ ఇర్ప సుకన్య సునీల్ దొర



**ప్రజాపక్షం/తాడ్వాయి:**బిఆర్ఎస్ పార్టీ ములుగు నియోజకవర్గ ఇన్‌చార్జి బడే నాగజ్యోతి ప్రజా నాయకురాలు సీతక్కపై, కాంగ్రెస్ నాయకులపై అనవసరపు ప్రకటనలు చేస్తున్నారని రాజకీయ లబ్ధికోసం అసత్య ప్రచారాలు చేయడంలో బడే నాగజ్యోతికి అలవాటని మేడారం ట్రస్టు బోర్డు చైర్మన్ ఇర్ప సుకన్య సునీల్ దొర అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మేము జర్నలిస్టులను బెదిరిస్తున్నామని వారి హక్కులను కాలరాస్తున్నారని చెప్పడం నిజంగా విడ్డూరమని, మీ ప్రభుత్వ హాయాంలో మీ యొక్క అవినీతిని అప్పటి న్యూస్ ఛానల్, పత్రికలు బయట పెడితే క్యూ న్యూస్ అధినేత తీన్మార్ మల్లన్నని అక్రమంగా అరెస్టు చేసి జైలులో వేసిన సంగతి నాగజ్యోతి మర్చిపోయారా? అలాగే ఆంధ్రజ్యోతి రాష్ట్ర ఆఫీస్‌పై మీ టిఆర్ఎస్ గుండాలు దాడి చేసి ఆఫీస్ ఫర్నిచర్, అద్దాలను పగలగొట్టిన విషయం మీకు తెలియదా అని మేడారం ట్రస్టు బోర్డు చైర్మన్ అన్నారు. మా ప్రభుత్వం వచ్చాక మా సీతక్క ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులు, ఇళ్ల పట్టాలు ఇప్పించే ప్రయత్నం చేస్తున్నారని ఇది మీరు గుర్తుంచుకోవాలని ఇది రాజకీయాల పేరుతో జరుగుతున్న నీచమైన కుట్ర అని ఇకనైనా మీరు పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడడం మాని ప్రజా క్షేత్రంలోకి వచ్చి జరుగుతున్న అభివృద్ధిని చూడాలని ఎక్కడో ఉండి ఇలాంటి పత్రికా ప్రకటన ఇచ్చినంత మాత్రాన మీరు లీడర్ కారని అది మీరు గుర్తుంచుకోవాలని బడే నాగజ్యోతిని హెచ్చరించారు.

## గ్రామాల్లో జోరందుకున్న ప్రైవేటు పాఠశాలల ప్రచారం

**ప్రజాపక్షం/గోవిందరావుపేట:**విద్యా సంవత్సరం ప్రారంభం సమీపిస్తున్న వేళ గ్రామీణ ప్రాంతాల్లో ప్రైవేటు పాఠశాలల ప్రచారం జోరుగా సాగుతుంది. అడ్మిషన్ల కోసం ప్రైవేటు స్కూల్ యాజమాన్యాలు ప్రత్యేక బృందాలతో గ్రామాల్లో ఇంటింటికి తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్నారు. కరపత్రాలు విద్యార్థులను ఆకర్షించే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. ఇంగ్లీష్ మీడియం కంప్యూటర్ నవోదయ స్పోకెన్ ఇంగ్లీష్ 100శాతం ఫలితాలు అంటు ప్రైవేటు పాఠశాలలు ప్రచారం చేస్తు బస్సు సౌకర్యం కూడా సదుపాయం వుంటుందని కొంతమంది ప్రవేటు యాజమాన్యాలు నేరుగా ఇళ్లకు వెళ్లి విద్యార్థుల వివరాలు సేకరిస్తూ అడ్మిషన్ల కోసం ఒప్పించే ప్రయత్నాలు చేస్తున్నారు.

## విద్యార్థులకు సన్మానం

**ప్రజాపక్షం/ వరంగల్ :** వరంగల్ జిల్లా సోషల్ ఫోరం ఆధ్వర్యంలో 2025–2026 విద్యా సంవత్సరంలో పదవ తరగతి సోషల్ సబ్జెక్టులో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను శుక్రవారం వరంగల్ జిల్లా డిఇఒ రంగయ్య నాయుడు ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డిఇఒ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదల అంకితభావంతో చదవాలని ఉన్నతమైనటువంటి శిఖరాలను సాధించాలని సోషల్ ఫోరం చేసేటువంటి కార్యక్రమం మిగతా ఫోరాలకు ఆదర్శంగా ఉందని ప్రశంసించారు. వరంగల్ జిల్లా అకాడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ సుజన్ తేజ మాట్లాడుతూ సోషల్ ఫోరం వరంగల్ జిల్లా సేవలు అద్భుతం అని కొనియాడారు. ఈకార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కట్ల శ్రీనివాస్, వరంగల్ జిల్లా సోషల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు తాటిపాముల రమేష్, ప్రధాన కార్యదర్శి పోలేపెల్లి రవి, సోషల్ ఫోరం గౌరవ అధ్యక్షులు మంగ రాజన్న, ఉపాధ్యక్షులు సాంబమూర్తి, చిట్టిబోతుల సంపత్, బిక్షపతి, కొల్లూరి శ్రీధర్, చిలివేరు శ్రీనివాస్, నేరెళ్ల రాజేందర్, బూర కుమారస్వామి, కోకిల సుధాకర్, గుడివాడ అశోక్, హనుమకొండ సోషల్ ఫోరం జిల్లా అధ్యక్షుడు మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సయ్య, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ సిబ్బందికి ఒకటవ తేదీనే జీతాలు: హర్షణీయం

**ప్రజాపక్షం/నెక్కొండ:**వరంగల్ జిల్లా నెక్కొండ మండలంలో రాష్ట్ర ప్రభుత్వం పంచాయతీ సిబ్బందికి ప్రతి నెల ఒకటవ తేదీన జీతాలు చెల్లించాలని తీసుకున్న నిర్ణయంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పంచాయతీరాజ్ శాఖ సమీక్ష సమావేశంలో 50వేల మంది పంచాయతీ సిబ్బందికి జీతాల కోసం ప్రతి నెల రూ.50 కోట్లు మంజూరు చేయడంతో పాటు, పెన్షన్లు నేరుగా బ్యాంక్ ఖాతాల్లో జమ చేసేలా చర్యలు తీసుకోవడం అభినందనీయమని పేర్కొనారు. అలాగే కొత్త పెన్షన్ల మంజూరులో ఒంటరి మహిళలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించడం సామాజిక బాధ్యతకు నిదర్శనమని తెలిపారు. ఈ సందర్భంగా టిపిసిసి సభ్యులు సొంతిరెడ్డి రంజిత్‌రెడ్డి, నెక్కొండ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, యువజన కాంగ్రెస్ నాయకుడు చల్లా శ్రీపాల్‌రెడ్డి, మహమ్మద్ అన్వర్, చల్లా పాపిరెడ్డి, గంధం సుధాకర్, కుసుమ చెన్నకేశవులు, తదితరులు ముఖ్యమంత్రి నిర్ణయాలను స్వాగతిస్తూ ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు.

## ఆర్‌టిసి బస్, ప్యాసింజర్ ఆటో ఢీ

**ప్రజాపక్షం/రాయపర్తి:**వరంగల్ జిల్లా రాయపర్తి మండల కేంద్రంలో శివారులోని వ్యవసాయ మార్కెట్ గోడౌన్ ఎదుట బుధవారం వరంగల్ ఖమ్మం జాతీయ రహదారిపై ఎదురెదురుగా ఆర్‌టిసి బస్సు, ప్యాసింజర్ ఆటో ఢీకొన్నాయి.




పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తొర్రూరు నుండి వరంగల్ వైపునకు వెళ్తున్న వరంగల్ 1డిపోకు చెందిన ఆర్‌టిసి బస్సును వరంగల్ నుండి తొర్రూర్ వైపునకు వస్తున్న ప్యాసింజర్ ఆటో అదుపు తప్పి ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌తో పాటు ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ, పాపకు తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని క్షతగాత్రులను చికిత్స నిమిత్తం 108 వాహనంలో వరంగల్ ఎంజిఎంకు తరలించారు.

## గుంత తవ్వారు వదిలేశారు

ప్రజాపక్షం/అల్లాదుర్గం: మండల పరిధిలో గల ముప్పారం తండాలో మిషన్ భగీరథ పైప్ లైన్ మరమ్మతులకై రోడ్డు పక్కనే తవ్వారు వదిలేసారు. నెల రోజులు గడుస్తున్న అధికారులు పట్టించుకోవడంలేదని తండావాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తవ్వి వదిలేసిన గుంతలో నీళ్లు చేరి దుర్వాసన వెదజల్లుతుందనీ చిన్నారులు అందులో పడి ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. మండల స్థాయి అధికారుల పర్యవేక్షణ కరువైందని, ప్రాణాలకు ప్రమాదం ఉందని వారు మండిపడ్డారు. ఇప్పటికైనా సంబంధిత మిషన్ భగీరథ అధికారులు వెంటనే స్పందించి మరమ్మతుల తీసిన గొయ్యిని వెంటనే పూడ్చాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాపక్షం/నర్సాపూర్: నర్సాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డులో నగర అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా కోటి పది లక్షలతో నిర్మించనున్న అండర్ గ్రౌండ్ డ్రైనేజ్, సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శుక్రవారం నర్సాపూర్ మున్సిపల్ చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై, మాజీ మున్సిపల్ చైర్మన్ మురళీధర్ యాదవ్, వైస్ చైర్మన్ బుచ్చేష్ యాదవ్, మున్సిపల్ కమిషనర్ సాయికుమార్ లతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు శ్రీకాంత్, నిరంజన్ దాస్, నాయకులు బాల్ రెడ్డి, షేక్ హుస్సేన్, రవి, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

## రాంపూర్ పాఠశాలకు ప్రీ-ప్రైమరీ తరగతులు

ప్రజాపక్షం/నిజాంపేట్ : నిజాంపేట మండలం రాంపూర్ గ్రామ ప్రభుత్వ పాఠశాలకు ప్రీ ప్రైమరీ తరగతులు మంజూరైనట్లు సర్పంచ్ పోన్నబోయిన ప్రవీణ్ తెలిపారు. చిన్నారుల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. గ్రామంలోని పిల్లలు ఇకపై గ్రామంలోని నాణ్యమైన ప్రాథమిక విద్యను అభ్యసించే అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. పాఠశాల అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని పేర్కొన్నారు.

## ఆకస్మిక తనిఖీల్లో ఎరువుల దుకాణాల పరిశీలన

ప్రజాపక్షం/పెద్దశంకరంపేట : రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరు దంలో టాస్క్ ఫోర్స్ బృందం ఎరువుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించింది. జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ ప్రభుదాస్, మండల వ్యవసాయ అధికారి లు ఎరువుల విక్రేతలు లైసెన్సులు తప్పనిసరిగా కలిగి ఉండాలని, గ డువు ముగిసేలోపు రెన్యువల్ చేసుకోవాలని సూచించారు. యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, పోటాష్ వివరాలను ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. బ్లాక్ మార్కెటింగ్, అధిక ధరలకు విక్రయాలు లేదా ఎరువుల అక్రమ తరలింపు జరిగితే ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్, ఫర్టిలైజర్ కంట్రోల్ ఆర్డర్ ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు తప్పనిసరిగా ఎరువులను సరైన నిల్వ సదుపాయాల్లో భద్రపరచి నాణ్యతతో సరఫరా చేయాలని మండల వ్యవసాయ అధికారి నాగం కృష్ణ సూచించారు.

## ధాన్యం కొనుగోళ్లపై అసత్య ప్రచారం నమ్మొద్దు

### నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జ్ రాజిరెడ్డి



ప్రజాపక్షం/వెల్దుర్తి: ధాన్యం కొనుగోళ్లపై నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అసత్య ప్రచారాలు చేస్తున్నారని నర్సాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి అన్నారు. మెదక్ జిల్లా వెల్దుర్తి మండలం లోని మంగళపర్తి, కుకునూరు పిఏసిఎస్ గోదాములను అలాగే ప్రైవేటు గోదాములు, రైతు వేదికలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెల్దుర్తిలో మొన్న జరిగిన బిఆర్ఎస్ పార్టీ ధర్నా కార్యక్రమంలో అవస్తవాలు మాట్లాడారని మండలంలో కొనుగోలు ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందని కొనుగోళ్లపై అసత్య ప్రచారాలు నమ్మొద్దని రైతులకు ఆయన విజ్ఞప్తి చేశారు. రైతులు తీసుకొచ్చిన ధాన్యం వర్షాలకు తడవకుండా వెంటనే గోదాములలో నిల్వ చేసి, కొనుగో లు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కోరారు. అందుబాటులో ఉన్న గోదాములను ధాన్యం కొనుగోళ్ల కోసం వినియోగించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు నరేందర్ రెడ్డి, జిల్లా కాం గ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మహేష్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ నాయకులు నరసింహారెడ్డి, వెల్దుర్తి సొసైటీ డైరెక్టర్ కిష్టా గౌడ్, నాయకులు మల్లేశం సుధాకర్ గౌడ్, మైసయ్య పాల్గొన్నారు.

## పిల్లలను జాగ్రత్తగా పెంచాలి

### మున్సిపల్ చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్



ప్రజాపక్షం/నర్సాపూర్:పిల్లలను తల్లిదండ్రులు జాగ్రత్తగా పెంచాలని మున్సిపల్ చైర్మన్ లక్ష్మీరాజు యాదవ్ అన్నా రు. శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని ఆరవ అంగన్వాడి కేంద్రంలో 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో మహిళా సంక్షేమ వారోత్సవ కార్యక్రమంలో భాగంగా శుక్ర వారం ఎర్లీ చైల్డ్ డెవలప్మెంట్ కార్యక్రమం నిర్వహించారు . ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మున్సిపల్ చైర్మన్ లక్ష్మి రాజు యాదవ్ మాట్లాడుతూ, పిల్లల బంగారు భవిష్యత్తుకు మొదటి రెండు సంవత్సరాలు చాలా ముఖ్యమైందని, పిల్లలకు పునాది లాంటిది కాబట్టి తల్లి గర్భం దాల్చిన నాటి నుంచి మంచి పోషకాహారం తీసుకోవాలన్నారు. బిడ్డ పుట్టిన తర్వాత మొదటి రెండు సంవత్సరాలు పిల్లలను జాగ్రత్తగా పెంచాలని తెలియజేశారు. పిల్లలకు మొబైల్ ఫోన్స్ ఇవ్వకుండా చక్కగా కథలు చెబుతూ బలమైన ఆహారం అందించాలని అన్నారు. అనంతరం ఐసిడిఎస్ సిడిపిఓ హేమా భార్గవి మాట్లాడుతూ, తల్లి గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డ పుట్టిన మొదటి 1000 డేస్ లేదా గోల్డెన్ డేస్ అని అంటారన్నారు. ఈ వయసు పిల్ల ల ఎదుగుదల అభివృద్ధి వేగంగా ఉంటుందని, పిల్లల కు సరై న పోషకాహారం ప్రేమ, ప్రేరణ అవకాశాలు కల్పించడం వల్ల పిల్లల బ్రెయిన్ అభివృద్ధి వేగంగా జరుగుతుందన్నారు. పిల్లలను పెంచి పోషించడంలో తండ్రుల పాత్ర ఎంతో కీలకమైందని గుర్తు చేశారు. అనంతరం పిల్లల తండ్రులు పిల్లలకు తినిపించడంలో ఏ విధంగా తినిపించాలి పిల్లలకు తినిపించే ఆహారం ఎలా వండాలో తండ్రులతో వంట డెమో చేయించి చూపించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ శివకుమారి, కౌన్సిలర్ సుధీర్ గౌడ్, పాల్గొన్నారు.

## శ్రీ నృసింహ నామస్మరణతో మార్మోగిన నాచగిరులు



ప్రజాపక్షం / గజ్వేల్: ప్రసిద్ధ నాచగిరి శ్రీ లక్ష్మీ నృసింహ క్షేత్రంలో శుక్రవారం ఆధ్యాత్మిక వైభవం సంతరించుకుంది. వేలాదిగా తరలివచ్చిన భక్తుల జయ జయ ధ్వనులు, స్వామివారి నామస్మరణ మధ్య ఆలయ కమిటీ చైర్మన్ రవీందర్ గుప్త, కార్యనిర్వహణ అధికారి బెల్లంకొండ రంగాచారితో కలిసి శ్రీ గురు మదనానంద పీఠాధిపతి శ్రీ మాధవానంద సరస్వతి స్వామీజీ గిరి ప్రదక్షిణ కార్యక్రమానికి జ్యోతి ప్రతిపాదనతో అంకురార్పణ చేశారు. లోక కళ్యాణార్థమై నిర్వహిస్తున్న గిరి ప్రదక్షిణలో పాల్గొనడం పూర్వజన్మ సుకృతమని, ఈ మహత్కార్యానికి శ్రీకారం చుట్టిన ఆలయ అధికారులు, పాలక మండలి, భక్తులు, దాతలపై స్వామివారి సంపూర్ణ ఆశీస్సులు ఉండాలని శ్రీ మాధవానంద సరస్వతి స్వామీజీ ఆకాంక్షించారు. శ్రీ నారసింహుడు నడయాడిన ఈ ప్రాంతం ఎంతో పవిత్రమైనదని, పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామిని దర్శిస్తే సర్వపాపాలు తొలగి ముక్తికి మార్గం దక్కుతుందని అన్నారు. స్వామివారి జన్మ నక్షత్రం స్వాతి నక్షత్రం సందర్భంగా గిరి ప్రదక్షిణ చేయడం ఆధ్యాత్మిక అనుభూతి కలిగిస్తుండగా, స్వామి నామస్మరణతో మానసిక ప్రశాంతత దక్కుతుందని ఉద్బోధించారు.

ఈ కార్యక్రమంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఆంక్షా రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు ఉప్పుశ్రీ రాజశేఖర శర్మ, జగన్నాథ ఆచార్యులు, చందా నాగరాజు గుప్త, జగ్గయ్యగారి శేఖర్ గుప్త, శ్రీనివాస్, రుద్ర శ్రీహరి, గాలి కిష్టయ్య, సురేందర్ రెడ్డి, సంతోష్ కుమార్, కర్రె పద్మ వెంకటేష్, సర్పంచ్లు సారిక యాదగిరి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



ప్రజాపక్షం/మనోహరాబాద్: మనోహరాబాద్ మండలంలోని లింగారెడ్డి పేట గ్రామానికి చెందిన కమ్మరి వికాస్ చారి, శివగోని నవీన్ గౌడ్, మన్నే మహేందర్, వర్గంటి బాలరాజ్ లు గత కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. బిజెపి రాష్ట్ర నాయకులు నత్తి మల్లేష్ ముదిరాజ్ సహకారంతో సీఎం సహాయ నిధికి దరఖాస్తు చేసుకోగా మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు చొరవతో 10,6,500 రూపాయలు మంజూరు కావడం జరిగింది. శుక్రవారం లింగారెడ్డి పేట గ్రామంలో తెలంగాణ రాష్ట్ర బిజెపి నాయకులు నత్తి మల్లేష్ ముదిరాజ్, బిజెపి మండల అధ్యక్షులు బక్క వెంకటేష్ గౌడ్ తో కలిసి లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సీఎం సహాయ నిధి నిరుపేదలకు గొప్ప వరం లాంటిదని ప్రతి ఒక్కరు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు,లబ్ధిదారులు,తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన అధికారులు



ప్రజాపక్షం/నర్సాపూర్: నర్సాపూర్ పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను శుక్రవారం టాస్క్ ఫోర్స్ టీం అధికారులు తాసిల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ రంజిత్ కుమార్ రెడ్డి, మండల వ్యవసాయ అధికారి దీపిక లు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా విత్తనాల నాణ్యత ను, రికార్డులను పరిశీలించారు. దుకాణాదారులు కచ్చితంగా లైసెన్సు కలిగి ఉండాలని, నాణ్యమైన విత్తనాలను విక్రయించాలని సూచించారు. దుకాణదారులు ఎప్పటికప్పుడు వ్యవసాయ శాఖ అధికారులకు రికార్డులు అందజేయాలని స్టాక్ రిజిస్టర్లు రోజువారీగా అప్డేట్ చేయాలని ఆదేశించారు. డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

## మండల ట్రాన్స్ పోర్ట్ కమిటీ ఆధ్వర్యంలో దుకాణాల తనిఖీలు



ప్రజాపక్షం/నిజాంపేట్ : నిజాంపేట్ మండలంలోని విత్తన దుకాణదారుల షాపులను మండల టాస్క్ ఫోర్స్ కమిటీ తనిఖీ చేయడం జరిగింది, ఈ మండల్ టాస్క్ ఫోర్స్ నందు తహసిల్దార్ ఎస్సై మరియు ఏఓ సభ్యులుగా ఉన్నారు. శుక్రవారం రోజున మండల కేంద్రంలోని ఆగ్రోస్ షాప్, హనుమాన్ ఫర్టిలైజర్స్, తిరుమల ఫర్టిలైజర్స్ షాపుల నందు విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల రిజిస్టర్స్ ను మండల కమిటీ సభ్యులు తనిఖీ చేయడం జరిగింది. ఈ సందర్భంలో మండల తహసిల్దార్ మాట్లాడుతూ రైతులకు మంచి నాణ్యమైన విత్తనాలను, పురుగులమందులను సకాలంలో అందించవలసిందిగా డీలర్స్ కు సూచనలు చేయడం జరిగింది. అదేవిధంగా మండల ఎస్సై రాజేష్ మాట్లాడుతూ నకిలీ విత్తనాలను అమ్మిన ఎడల చట్టపరమైన కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుందని చెప్పడం జరిగింది. ఏఓ మాట్లాడుతూ ప్రతి డీలరు రోజువారి క్రయవిక్రయాలను రిజిస్టర్లో పొందుపరచాలి. అదేవిధంగా స్టాక్ బోర్డును కనిపించే విధంగా ప్రదర్శించాలి అధిక ధరలకు అమ్మిన యెడల చట్టపరమైన చర్యలు తీసుకోబడును అని చెప్పడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఆర్ఐ ప్రీతి, ఏఈఓ రమ్య దుకాణ యజమానులు తదితరులు పాల్గొన్నారు.

## మూడు కోట్ల 92 లక్షల రుణాలు మంజూరు



**ప్రజాపక్షం/వెల్దుర్తి:** 99 ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక లో బాగంగా వెల్దుర్తి మండల మహిళా సమైక్య ఋుణ మేళా సమావేశం నిర్వహించిడం జరిగింది అని ఏపిఎం సుభాష్ గౌడ్ తెలిపారు. ఈ సమావేశంలో వెల్దుర్తి మండలంలో 6 బ్యాంకు లో 31 సంఘాలకు 3 కోట్ల 92 లక్షలు రుణాలు మంజూరు చెయ్యడానికి సాంక్షన్ లెటర్ ఇవ్వడం జరిగింది అని ఆయన తెలిపారు. అలాగే మహిళా శక్తి లో బాగంగా మహిళా సంఘాల సభ్యులకు ఆర్థిక అభివృద్ధి కొరకు పెరటి కోళ్లు పంపిణీ చెయ్యడం జరిగింది. జరిగిందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి బ్యాంక్ మేనేజర్ హరికిషన్, టీజీబీ బ్యాంక్ మేనేజర్ మధు, సిసి లు సుల్తానా, విజయలక్ష్మి, లక్ష్మణ్, స్వప్న, ఎమ్మెస్ అధ్యక్షులు రూప, కార్యదర్శి భాగ్యారాణి, ఎంఎస్ఏ గీత, ఎంసిఓ గంగాధర్, వివిధ గ్రామ సంఘాల అధ్యక్షురాలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి...

**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** మహిళలు నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకొని ఆర్థికంగా ఎదుగాలని మిట్టపల్లి గ్రామ సర్పంచ్ చింతల శ్రీనివాస్ యాదవ్ సూచించారు. సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామంలో తెలంగాణ ర్యాంపు ప్రాజెక్ట్‌లో భాగంగా మహిళలకు 15రోజులు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. శుక్రవారం గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ చేతుల మీదుగా శిక్షణ పొందిన మహిళలకు నైపుణ్య శిక్షణ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో రాణిస్తున్నారని,మన గ్రామ మహిళలు కూడా ప్రతి విషయంలో నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకొని పారిశ్రామికవేత్తలుగా ఎదుగాలని సూచించారు. శిక్షణలో మెటీరియల్ అందించి స్కూల్ యూనిఫామ్స్ విషయాలను నేర్చుకున్నారని ,ఒక మహిళను పారిశ్రామికవేత్తగా తయారు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో శిక్షణ సంస్థ సభ్యులు,వార్డు సభ్యులు,మహిళలు తదితరులు పాల్గోన్నారు.

## లింగారెడ్డిపల్లిసందర్శించిన మహిళశిశుసంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిత రామచంద్రన్

**ప్రజాపక్షం/ సిద్దిపేట :** ప్రజాపాలన 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట జిల్లా అంబేద్కర్ నగర్ సెక్టర్ లింగారెడ్డిపల్లి గ్రామాన్ని మహిశ శిశు సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అనిత రామచంద్రన్ శుక్రవారం సందర్శించారు. ప్రాథమిక బాల్య వికాసం కార్యక్రమాల అమలు తీరుపై సమీక్ష నిర్వహించారు. అలాగే మిట్టపల్లి గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించి కేంద్రంలో ఏర్పాటు చేసిన పెయింటిగ్స్, పిల్లల అభ్యాసానికి అనుకూలంగా రూపొందించిన విధానాలు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. చిన్నారుల మెదడు, వికాసం ప్రీ స్కూల్ విద్య , స్కూల్ రెడినేస్ . మొదటి వంద రోజుల ప్రాముఖ్యత పోషకాహారం, తల్లిదండ్రుల భాగస్వామ్యంపై దృష్టిసారించాలనారు. ఈకార్యక్రమంలో జిల్లా సంక్షేమశాఖ అధికారి శారద తదితరులు పాల్గొన్నారు.

# యువతకు నైపుణ్యం ఎంతో అవసరం

### ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**ప్రజాపక్షం/భూపాలపల్లి :** యువతకు నైపుణ్యం ఎంతో అవసరమని, నేర్చుకున్న కోర్సులో నైపుణ్యం పొంది మంచి ఉద్యోగం సాధించాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు ఆకాంక్షించారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో టాస్క్ (TASK) కోర్సును పూర్తి చేసిన విద్యార్థులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గండ్ర మాట్లాడుతూ, యువతకు నైపుణ్యాభివృద్ధి ఎంతో అవసరమని, ఇటువంటి కోర్సులు విద్యార్థుల భవిష్యత్తుకు దోహదపడతాయని తెలిపారు. విద్యార్థులు నేర్చుకున్న నైపుణ్యాలను ఉపయోగించుకుని మంచి ఉద్యోగ అవకాశాలను సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు సాంకేతిక విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకోవడం ద్వారా ఉద్యోగ అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, పలువురు స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# హుస్నాబాద్ ఇంజనీరింగ్ కాలేజీలో మైనింగ్ కోర్సు

### మంజూరి చేయాలని సిఎంకు మంత్రి లేఖ

**ప్రజాపక్షం/హుస్నాబాద్ :** హుస్నాబాద్ శాతవాహన యునివర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీకి మైనింగ్ కోర్సు మంజూరు చేయాలని కోరుతూ తెలంగాణ బి సీ రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడు ముఖ్య మంత్రి రేవంతురెడ్డికి శుక్రవారం లేఖ రాశారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ తెలంగాణలో ప్రత్యేకించి ఉత్తర తెలంగాణలో సింగరేణి కాలరీస్ ద్వారా బొగ్గు తవ్వకం కార్యకలాపాలు ఎక్కువగా ఉన్నందున ఈ ప్రాంత విద్యార్థులకు భవిశ్యత్తులో ఎంతో ఉపయోగంగా ఉంటుందని ఆన్నారు. హుస్నాబాద్ మెట్ట ప్రాంత ప్రజలు ఆర్థికంగా చాల వె నకబడి ఉన్న ప్రాంతం గా ఉన్నందున ,

**నేడు బి టెక్‌లో మైనింగ్ ఇంనీర్ల డిమాండ్**

పెరుగనున్న నేపాథ్య ంలో ప్రయివేటు ఎక్కువగా ఉన్నరని ప్రభుత్వం సంస్థల్లో ఆవకాశాలు చాల తక్కుగా ఉన్నందున హుస్నాబాద్ శా తవాహన ఇంజనీరింగ్ కొత్తగా స్థాపించదబడినందున మైనింగ్ కోర్సు కు ఈ ఆవకాశం కల్పించాలని కోరారు. ఈ ప్రాంతం నుండి ఎక్కువ పేద విద్యార్థులు ఉన్నందున శాతవాహన కాలేజీలో బిటెక్ మైనింగ్ ప్రవేశపెడుతూ సరైన సిబ్బందిని మంజూరు చేయాలని ము ఖ్యమంత్రికి విజ్ఞప్తి చేశారు.

# కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలి



**ప్రజాపక్షం/రేగోడు :** ప్రభుత్వం చేపట్టిన జొన్నల కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని రేగోడ్ పిఎసిఎస్ రాజు యాదవ్ అన్నారు శుక్రవారం రేగోడ్ గజవాడ గ్రామాల్లో జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు అనంతరం మాట్లాడుతూ కొనుగొలు కేంద్రాల్లో జొన్నలకు క్వింటాలకు అందిస్తుందని దళారులకు అమ్ముకొని మోసపోవద్దని రైతులకు తెలిపారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామవ్వ ఎస్సై పోచయ్య టీపీపీసీ మెంబర్ మున్నూర్ కిషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దిగంబరావ్ శివాజీ రావు సాయలు బాలకాషన్ రెడ్డి రాములు మాజీ కోఆప్షన్ చోటు మియా మల్లికార్జున్ పీరా నాయక్ సంగ్యానాయక్ తదితరులు ఉన్నారు

# ఘనంగా టిపిటిఎఫ్ ఆవిర్భావ వేడుకలు



**ప్రజాపక్షం/తొర్రూరు :** పట్టణ కేంద్రంలోని టీపీటీఎఫ్ భవన్‌లో 12వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా టీపీటీఎఫ్ పతాకాన్ని సీనియర్ నాయకులు పోరెడ్డి వినోద్ రెడ్డి ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కార్యదర్శి, తొర్రూరు మండల శాఖ అధ్యక్షులు కొండం జనార్ధన్ అధ్యక్షతన నిర్వహించిన ఈ సమావేశంలో వినోద్‌రెడ్డి మాట్లాడుతూ విద్యారంగ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ దర్శిని సంపాదకులు సూరం ఉపేందర్‌రెడ్డి, పీజీహెచ్‌ఎం లక్ష్మి నారాయణ, జిల్లా కౌన్సిలర్ బోగ సంపత్, ఎడ్ల బ్రహ్మానందరెడ్డి, కొయ్యడ కుమారస్వామి, సానిక వెంకటనారాయణ, శనిగరం శ్రీను, అనమాల యాకయ్య, అనమాల మహేందర్, బేతమళ్ల కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# నిరుపేదలకు అండగా నిలవడమే ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ధ్యేయం



**ప్రజాపక్షం/రాయపర్తి:** నిరుపేదలకు అండగా నిలవడమే ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ధ్యేయమని ఫౌండేషన్ చైర్మన్ పరుపాటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వరంగల్ జిల్లా రాయపర్తి మండలం తెట్టేకుంట తండా గ్రామానికి చెందిన బిఆర్ఎస్ పార్టీ నాయకులు భూక్య శ్రీనివాస్ భార్య భూక్య సునీత ఇటీవల అనారోగ్యంతో మరణించగా శుక్రవారం బాధిత కుటుంబాన్ని ఆయన పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ తరపున 50 కెజిల బియ్యం, ఆయిల్ క్యాన్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాయపర్తి మండల పార్టీ నాయకులు లేతాకుల రంగారెడ్డి, సర్పంచ్ ఇస్లావత్ సంతోష్, బాలాజీ, యాకూబ్, నరసింహా, గిరి, దుగ్గా, మాంజి, రమేష్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

దాతల సహకారంతో సంగెం గ్రామానికి స్వర్గ రథం

## మలబార్‌లో "ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జువెలరీ షో"




**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** సిద్దిపేట పట్టణ కేంద్రంలోని మలబార్ గోల్డ్ అండ్ డైమాండ్స్ షోరూమ్‌లో శుక్రవారం ఆర్టిస్ట్రీ బ్రాండెడ్ జువెలరీ షోను జడ్‌పి చైర్‌పర్సన్ రోజా శర్మ,మున్సిపల్ చైర్‌పర్సన్ మంజుల,డాక్టర్ చందనలు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్టోర్ హెడ్ షరిక్ షరాఫ్ మాట్లాడుతూ తమ సంస్థలో ఆర్టిస్ట్రీ షో బ్రాండెడ్ జువెలరీ ఒక విశిష్ట ఆభరణాల ప్రదర్శన అని,ఈ ప్రదర్శనలో బంగారం,వజ్రాభరణాలు,జాతి రత్రాభరణాలను ప్రదర్శిస్తున్నామని తెలిపారు. అద్వితీయమైన కళానైపుణ్యంతో అంతులేని హుందాతనం కూడిన, నగిషి చెక్కిన ప్రతి ఆభరణం కళాత్మకతకు నిదర్శనంగా నిలుస్తుందన్నారు. ఆర్టిస్ట్రీ షోలో ప్రత్యేక ఆకర్షణాలుగా మలబార్ బ్రాండ్ల సమహారం మైన్ ధృవీకరించిన వజ్రాభరణాలు వివాహవిందు సంబరాల కోసం ఏరా అన్కట్ వజ్రాలతో పొదిగిన విశిష్ట శ్రేణి,ఫ్రెష్యా జాతి రత్నాభరణాల సముదాయం ఎథిక్స్ హస్తకళా నైపుణ్యంతో తయారు చేసిన ఆభరణాల,జోల్ అధునాతన డిజైన్లతో తేలికపాటి ఆభరణాలను మగువల మనుసును దోచుకుంటాయన్నారు. ఈ ప్రదర్శన జూన్ 1 వరకు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఆర్టిస్టు బేబి లౌక్య,మేనేజర్లు స్వామి, వాజిద్, బాస్కర్, సిబ్బంది తదితరులు పాల్గోన్నారు.

## కల్యాణ లక్ష్మి చెక్కులను పంపిణీ చేయాలి

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** నియోజకవర్గంలో పెడింగ్‌లో ఉన్న కళ్యాణ లక్ష్మి చెక్కులను లబ్దిదారులకు వెంటనే చెలించే విధంగా స్థానిక ఎంఎల్‌ఎతో పాటు ఇంచార్జ్ మంత్రి చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కమిటీ సభ్యులు బట్టు దయానందరెడ్డి డిమాండ్ జేశారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గజ్వేల్ నియోజక వర్గంలో 400 మంది లబ్దిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కులు మంజూరై పంపిణీకి సిద్దంగా ఉన్నప్పటికి నాయకుల నిర్లక్ష్యంతో లబ్దిదారులకు పంపిణీ చేయడంలో జాప్యం చేయడం పట్ల ఆయన అసంతృప్తిని వ్యక్తం చేశారు. అధికార, ప్రతి పక్ష పార్టీ నేతల పంతాలతో పేద ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన అన్నారు.15 రోజుల్లో చెక్కులు పంపిణీ చేయకుంటే ఆర్డీఒ కార్యాలయం ముందు లబ్దిదారులతో కలిసి సిపిఐ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తామని హెచ్చరించారు.

## బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మాజీ మంత్రి హరీష్‌రావు



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం ఇబ్రహింనగర్ గ్రామంలో జరిగి పోచమ్మ బోనాల కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలోని నిర్వహించిన బోనాల ఊరేగింపులో పాలుపంచుకన్నారు. ప్రజలకు అభివాదం చేసుకుంటు ర్యాలీలో పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ వజ్రవ్వ కుంటయ్య, బిఆర్ఎస్ నేతలు హరీష్‌రావును ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో మాజీ ఎంపిపి మాణిక్యరెడ్డి, రాధకిషన్‌శర్మ,ముల్కల మల్లేశం, కనకరాజు, కాముని శ్రీనివాస్, జంగిటి శ్రీనివాస్, అయా గ్రామా ల సర్పంచ్‌లు. మాజీ ఎంపిటిసిలు, గ్రామప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సంగెం గ్రామానికి స్వర్గ రథం అందుబాటు

ప్రజాపక్షం/సంగెం: దాతల ఉదారత, గ్రామస్తుల సమిష్టి కృషితో సంగెం గ్రామానికి నూతన స్వర్గ రథం (వైకుంఠ రథం) అందుబాటులోకి వచ్చింది. స్థానిక దాతల సహాయ సహకారాలతో కొనుగోలు చేసిన ఈ వాహనానికి ప్రసిద్ద కోట గండి మైసమ్మ ఆలయం వద్ద గ్రామస్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అక్కడి నుంచి ఈ స్వర్గ రథాన్ని సంగెం గ్రామానికి తీసుకువచ్చారు. గ్రామంలో ఎవరైనా మరణిస్తే వారి అంతిమ యాత్ర గౌరవప్రదంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగాలనే సదుద్దేశంతో దాతలు ముందుకొచ్చి ఈ రథాన్ని సమకూర్చడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువకులు, దాతలు పాల్గొన్నారు.

## మిత్రుడికి విద్యార్థుల ఆర్థిక సహాయం :

ప్రజాపక్షం/నడికూడ : నడికూడలో ఇటీవలే మరణించిన ఆకారపు క్రాంతికుమార్ కుటుంబాన్ని నడికూడ పదవతరగతి 2007 08 బ్యాచ్ కు చెందిన మిత్రబృందం క్రాంతి కుమార్ కుటుంబానికి ఆర్థికంగా అండగా ఉండాలనే ఉద్దేశంతో (ప్రస్తుతం 50,000) వేల రూపాయలను క్రాంతికుమార్ భార్య వారి కుమారిడి పేరుపై జాయింట్ ఎకౌంట్ తెరిచి ఫిక్స్‌డు డిపాజిట్ చేయాలని నిర్ణయించుకున్నామని వారికుటుంబసభ్యుల సమక్షంలో హామీఇచ్చామని మిత్రులు తెలిపారు.భవిష్యత్తులో కూడా ఎలాంటి సాయం అవసరమైనా తమవంతు సాయం చేస్తూ ఉంటామని మీరు అధైర్యపడవద్దని మీకు టుంబానికి అండగా ఉంటామని మనోధైర్యం కల్పించారు.ఈకార్యక్రమంలో పదవతరగతి మిత్రబృందం దేవునూరి ప్రశాంత్,మొర్రి పరశురామ్,ఎండిగ శ్రీధర్, కడవెండి ప్రశాంత్ చెంగిచెర్ల వేణు, వెంకటేష్, (చంద్రమౌళి). శివ, రాజు, మహేందర్, చందర్ ఉన్నారు.

## ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ

ప్రజాపక్షం/ములుగు: ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం వేగవంతం చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పి సుదర్శన్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్...2026 ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంపై శుక్రవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి పి సుదర్శన్ రెడ్డి అన్ని జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి ములుగు జిల్లా నుండి జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుండి ఇన్‌ఛార్జి ఆర్ డిఓ ప్రతాప్ హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ స్వచ్ఛమైన ఓటరు జాబితాలు ప్రజాస్వామ్య వ్యవస్థకు బలమైన పునాదిగా ఉంటాయని అన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. బిఎల్ఓలు ఇంటింటికి వెళ్ళి ఎన్యూమరేషన్ ఫారమ్‌ల పంపిణీ, సేకరణ చేపడుతుండగా, ఓటర్లు కూడా ఎన్నికల కమిషన్ ఇంటిగ్రేటెడ్ నెట్‌వర్క్ ద్వారా ఆన్‌లైన్‌లో తమ వివరాలను నమోదు చేసుకునే సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అన్ని మండలాల ఏఈఆర్ఓలు, బిఎల్ఓలు, సూపర్‌వైజర్లు, ఎన్నికల తహసీల్దార్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు జాబ్ మేళా - ఝాన్సీరెడ్డి



ప్రజాపక్షం/పాలకుర్తి: నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు మెగా జాబ్ మేళా ఏర్పాటుచేసినట్లు పీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీసోమేశ్వర స్వామి కళ్యాణ మండపంలో ఝాన్సీ రాజేందర్ రెడ్డి ఫ్యామిలీ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాను చైర్మన్ ఝాన్సీరెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు లక్ష్యంతో ఈ జాబ్ మేళాను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కుమార స్వామి, మార్కెట్ చైర్పర్సన్ మంజుల భాస్కర్, ప్రతిని ధులు, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు కల్పించాలి


ప్రజాపక్షం/పాలకుర్తి: పాలకుర్తి బస్టాండ్‌లో మౌలిక సదుపాయాలు లేక ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వెంటనే మౌలిక సదుపాయాలు కల్పించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు చిట్యాల సోమన్న, మండల కార్యదర్శి మాచర్ల సారయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బస్టాండ్‌ను సీపీఎం మండల కమిటి ఆధ్వర్యంలో సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్సులు నిలుపు స్థలం ఆవరణలో రోడ్లు గుంతల మయంగా మారిందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి బస్టాండ్‌ను, ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మాసంపల్లి నాగయ్య, మదార్, సంపత్, శ్రీలత, సమ్మయ్య, రమేష్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోళ్ల జాప్యంతో రైతులలో ఆందోళన

### పల్లా సుందర్ రాంరెడ్డి


ప్రజాపక్షం/దేవరుప్పుల: మండలంలో పలు వరిధాన్యం కొనుగోలు సెంటర్లో ధాన్యం కొనుగోళ్లు నత్తనడకన సాగుతుండడంతో రైతన్నలు తీవ్ర ఆందోళన చెందుతున్నారని బీఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకుడు పల్లా సుందర్ రాంరెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో రోజుల తరబడి పడిగాపులు కాయాల్సి రావడం, ఇటు నార్లు పోసే సమయం దగ్గరపడడంతో అన్నదాతలు తీవ్ర సందిగ్దంలో పడ్డారన్నారు. వ్యవసాయ పనులకు సమయం లేకపోవడంతో ప్రభుత్వం వెంటనే స్పందించి ధాన్యాన్ని వేగంగా తూకం వేసి మిల్లులకు తరలించి రైతులకు నష్టం లేకుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## వృద్ధురాలి మెడలో బంగారు గొలుసు అపహరణ



ప్రజాపక్షం/దేవరుప్పుల: మండలంలోని పెద్దమడూరు గ్రామంలో శుక్రవారం తెల్లవారు జామున దొంగతనం జరిగింది. గ్రామానికి చెందిన వృద్ధురాలు కప్పరి యాదమ్మ మెడలోని సుమారు 3 తులాల బంగారు గొలుసు గుర్తు తెలియని వ్యక్తి అపహరించినట్లు ఆమె కుమారుడు కొప్పరి కొమురయ్య ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన దేవరుప్పుల ఎస్ఐ సృజన్ కుమార్ దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలంలో లభించిన ఆధారాలు, అనుమానితుడు ఉపయోగించిన వాహనం, చెప్పుల వివరాల ఆధారంగా పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.

## కల్తీ విత్తనాలు అమ్మితే చర్యలు...



ప్రజాపక్షం/శివ్వంపేట : ఎరువులు, విత్తనాల షాపులలో రైతులకు కల్తీ విత్తనాలు అమ్మితే చర్యలు తప్పవని తహశీల్దార్ కమలాద్రి అన్నారు. శుక్రవారం శివ్వంపేట లోని ఫర్టిలైజర్ దుకాణాలను ఎస్ఐ మధుకర్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి లావణ్యతో కలిసి దుకాణాలను సందర్శించి పరిశీలించారు. డీలర్లు ఎప్పటికప్పుడు రిపోర్టులు అగ్రికల్చర్ అధికారులకు అందజేయాలన్నారు. క్రయ విక్రయాలలో డీలర్లు నిబంధనలు ఉల్లంగిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు.

## ధాన్యం కొనేవరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టం..

### బిఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్



ప్రజాపక్షం/శివ్వంపేట : రైతుల ధాన్యం కొనేవరకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని బీఆర్ఎస్ మండలాధ్యక్షులు రమణాగౌడ్, జిల్లా గ్రంధాలయ సంస్థ మాజీ చైర్మన్ చంద్రాగౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని దొంతి గ్రామంలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలలో వడ్ల కొనుగోళ్లకు లారీలు రాక ఎక్కడికక్కడ పేరుకుపోయాయని అన్నారు. రైతులు కొనుగోలు కేంద్రాల వద్ద అరిగోస పడుతూ పడిగాపులు కాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల ధాన్యం కొనుగోలు చేసేవరకు రైతులకు అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గైనిబైటి ప్రవీణ్‌గౌడ్, నాయకులు సోమ కృష్ణ, మాజీ కోఆప్షన్ సభ్యులు లాయక్, బుద్దుల భిక్షపతి తదితరులు ఉన్నారు.

## సోషల్ స్టడీస్‌లో జిల్లా స్థాయి మూడవ స్థానం సాధించిన విద్యార్థి

### అభినందించిన జిల్లా విద్యాశాఖ అధికారి

ప్రజాపక్షం/రాయపర్తి: మండలంలోని కొండూరు గ్రామంలోని పిఎం శ్రీ జడ్పిహెచ్ఎస్ పాఠశాలకు చెందిన విద్యార్థి చెట్టే చరణ్ సోషల్ ఫోరం వరంగల్ జిల్లా ఆధ్వర్యంలో వరంగల్ జిల్లాలో సోషల్ స్టడీస్‌లో నిర్వహించిన పోటీ పరీక్షలో 98 మార్కులు సాధించి జిల్లాలో మూడవ స్థానం సాధించాడు. ఈ సందర్భంగా విద్యార్థి చరణ్‌ను శుక్రవారం జిల్లా విద్యాశాఖ అధికారి రంగయ్య నాయుడు, ఏఎంఓ సుజన్, తేజ, డిఎస్ఓ శ్రీనివాస్‌లు అభినందించి శాలువాతో సన్మానించి సర్టిఫికేట్, మెమొంటోను అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మలత విద్యార్థి చరణ్, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుడు కేసోజు సత్య నారాయణను అభినందించారు. విద్యార్థిని ఇదే విధంగా కష్టపడి జీవితంలో మంచి స్థాయికి రావాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థికి అభినందనలు తెలిపారు.

## గొర్రెలు మేకలు అపహరణ.

ప్రజాపక్షం/భీమదేవరపల్లి : భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూరు గ్రామానికి చెందిన జక్కుల మొండయ్య కు చెందిన నాలుగు మేకలు రెండు గొర్రె పోతులు దాదాపుగా లక్షరూపాయల విలువచేసే జీవాలు పోవడంతో రైతు లబోదిబో మంటున్నాడు.వివరాల్లోకి వెళ్తే ములక్నూరు చెందిన జక్కుల మొండయ్య బుధవారం సాయంత్రం ఏడు గంటలకు భోజనం కోసం ఇంటికి రాగా ఇదే అదునుగా దొంగలు తన మందలో నుండి నాలుగు మేకలు మరియు రెండు గొర్రెపోతులు అపహరించడం జరిగిందని తాను తిరిగి వెళ్లి చూడగా అపహరణకు గురైనట్లు గుర్తించిన రైతు ఉదయం భీమదేవరపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడం జరిగింది.దీనిపై ఎస్ఐ రాజు స్పందిస్తూ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తానని రైతుకు హామీఇవ్వడం జరిగింది.

## పరిశుభ్రతపై అవగాహన




ప్రజాపక్షం/జఫర్‌గడ్: అబ్బాపూర్ బండ తండా (శంర్ తండా) గ్రామ పంచాయితీలో సర్పంచ్ బానోతు అరుణ శ్రీ ఆధ్వర్యంలో మహిళలు, బాలికలకు ఋతుస్రావ పరిశుభ్రత నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. నాణ్యమైన శానిటరీ ప్యాడ్లు ఉపయోగించడం, ప్రతి 46 గంటలకు మార్చుకోవడం, చేతులను శుభ్రంగా కడుక్కోవడం వంటి సూచనలు చేశారు. వాడిన ప్యాడ్లను సక్రమంగా పారవేయాలని, నెలసరి సహజ శారీరక ప్రక్రియ అని, దీనిపై అపోహలు, సిగ్గు అవసరం లేదని వివరించారు. మహిళల ఆరోగ్య పరిరక్షణకు సరైన అవగాహన ఎంతో అవసరమని తెలిపారు.

## మిత్రుడి కుటుంబానికి అండగా నిలిచిన స్నేహితులు.

ప్రజాపక్షం/ధర్మసాగర్ : ధర్మసాగర్ మండలకేంద్రానికి చెందిన చెట్ల మహేష్ ఇటీవల అనారోగ్యానితో మృతిచెందడంతో ఆయన కుటుంబానికి చిన్ననాటి స్నేహితులు 1997—1998 బ్యాచ్ కు చెందిన 10 వతరగతి తోటి విద్యార్థులు మహేష్ కుటుంబ పరిస్థితులు తెలుసుకొని మానవత్వంతో ముందుకు వచ్చారు.గురువారం మహేష్ కటుంబసభ్యులను పరామర్శించిన మిత్రులు అతని భార్య,తల్లిదండ్రులు,తమ్ముడికి రూ,45వేలరూపాయలను ఆర్థిక సహాయాన్ని అందజేశారు.కష్టకాలంలో ఆకుటుంబం ఒంటరిగా లేదని తాము అన్నివిధాల అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈసందర్భంగా స్నేహితులు మహేష్,తో గడిపిన పాఠశాల జ్ఞాపకాలను నెమరు వేసుకొని భావోద్వేగానికి గురయ్యారు.జీవితంలో నిజమైన స్నేహం విలువ ఇలాంటి సధర్భంలోనే తెలుస్తోందని అన్నారు.చిన్ననాటి మిత్రులు చూపిన మానవత్వాన్ని స్థానికులు అభినందించారు.

# సవితా కబీర్ వర్ధంతి



**ప్రజాపక్షం/వాంకిడిః** రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఆశయాల సహచరి డాక్టర్ సవితా కబీర్ 23వ వర్ధంతిని శుక్రవారం మండల కేంద్రంలోని జేత్వాన్ బుద్ధ విహార్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షులు డాక్టర్ అశోక్ మహాల్కర్ మాట్లాడుతూ రమాబాయి అకాల మరణం అనంతరం బాబాసాహెబ్ ఆరోగ్య పరిస్థితిని దగ్గరుండి చూసుకున్న సవితా కబీర్, ఆయనకు అండగా నిలిచి రాజ్యాంగ నిర్మాణ ప్రక్రియలో సహకరించారని తెలిపారు. బాబాసాహెబ్ నిరంతరం అనారోగ్యంతో బాధపడుతున్న సమయంలో వైద్యసేవలు అందిస్తూ రాజ్యాంగ రచన పూర్తి చేసే వరకు తోడుగా నిలిచారని కొనియాడారు. సమానత్వం, సామాజిక న్యాయం, బౌద్ధ ధర్మ పరిరక్షణ కోసం ఆమె చేసిన కృషిని యువత ఆదర్శంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ అట్రాసిటీ కమిటీ సభ్యులు, ఆర్పిఐ (ఎబి) జిల్లా నాయకులు దుర్గం శ్యామ్ రావు, బలవంత్ ఉప్రే, చంద్రమణి కొబ్రగడే, బౌద్ధ మహాసభ సభ్యులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

### సింగరేణి ప్రధాన వైద్య అధికారి కిరణ్ రాజ్

**ప్రజాపక్షం/రామకృష్ణాపూర్ః** రామకృష్ణాపూర్ సింగరేణి ఏరియా ఆసుపత్రిని సంస్థ ప్రధాన వైద్య అధికారి కిరణ్ రాజ్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలోని అత్యవసర విభాగం, వివిధ వార్డులు, ఓపి విభాగం తదితర సౌకర్యాలను పరిశీలించి వాటి నిర్వహణ పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన వైద్యులతో సమావేశమై ఆసుపత్రి నిర్వహణకు సంబంధించిన సమస్యలు, అవసరాలు, వైద్య సేవల మెరుగుదలపై చర్చించి వివరాలు తెలుసుకున్నారు. రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ప్రతి ఉద్యోగి క్రమశిక్షణతో, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి మర్యాదపూర్వకంగా, సకాలంలో వైద్య సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఉప ప్రధాన వైద్య అధికారి (అడ్మిన్) మధు కుమార్, సీనియర్ పర్సనల్ ఆఫీసర్ మదర్ సాహెబ్, విజయలక్ష్మి , ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.




# సెక్యూరిటీ గార్డు టెండర్లలో భారీ అక్రమాలు

### సిపిఐ పట్టణ కార్యదర్శి కామెర దుర్గరాజు

**ప్రజాపక్షం / మందమర్రిః** మందమర్రి సింగరేణి ఏరియా పరిధిలో సెక్యూరిటీ గార్డు కాంట్రాక్టుల కేటాయింపు టెండర్ ప్రక్రియలో భారీ అక్రమాలు జరుగుతున్నాయని కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా మందమర్రి పట్టణ కార్యదర్శి కామెర దుర్గరాజు ఆరోపించారు. శుక్రవారం సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అర్హతలు లేని కాంట్రాక్ట్ సంస్థకు సింగరేణి అధికారులు కావాలనే టెండర్ కట్టబెట్టేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. నిబంధనల ప్రకారం ఉండాల్సిన మ్యాన్‌పవర్, సాంకేతిక అర్హతలు లేని సంస్థ కోసం మొదట రెండు నెలలు టెండర్ ప్రక్రియ ఆపి, వారికి లైసెన్స్ వచ్చాక కట్టబెట్టే ప్రయత్నం చేశారని వివరించారు. దీనిపై కోర్టు నుంచి ఆర్డర్ వచ్చాక తప్పనిసరి పరిస్థితుల్లో ఆ సంస్థను డిస్క్వాలిఫై చేశారన్నారు. కోర్టు ఆర్డర్ పై సింగరేణి లీగల్ ఒపీనియన్ రాకముందే కక్షసాధింపుగా మరో సంస్థను డిస్క్వాలిఫై చేశారని పేర్కొన్నారు.




అధికారులు తమ అంతిమ లక్ష్యం కోసం నాలుగో సంస్థకు టెండర్ అప్పగించాలని ఉవ్విళ్లూరుతున్నారని విమర్శించారు. సదరు సంస్థకు నిబంధనల ప్రకారం పసారా లైసెన్స్ పొంది సంవత్సరం గడవలేదని, నకిలీ ఎక్స్పీరియన్స్ సర్టిఫికెట్ సమర్పించినా అధికారులు అనుకూలంగా నిర్ణయం తీసుకోవడం వెనుక భారీ అవినీతి కోణం ఉందన్నారు. కార్మికుల భద్రతకు సంబంధించిన కీలక విభాగాన్ని అనుభవం లేని సంస్థలకు అప్పగించడం సరికాదన్నారు. వెంటనే సింగరేణి ఉన్నతాధికారులు స్పందించి పూర్తి స్థాయి విచారణ జరిపి టెండర్ ప్రక్రియను రద్దు చేయాలని, నకిలీ పత్రాలు సమర్పించిన సంస్థపై, అందుకు సహకరించిన అధికారులపై విజిలెన్స్ విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

# పంట వ్యర్థాలను కాల్చద్దు

### మండల వ్యవసాయాధికారి దిలీప్ కుమార్

**ప్రజాపక్షం / రెబ్బనః** పంట కోత తర్వాత పొలాల్లో మిగిలిపోయిన వరి, గోధుమ, మొక్కజొన్న గడ్డి వంటి పంట అవశేషాలను తగలబెట్టవద్దని రెబ్బన మండల వ్యవసాయాధికారి దిలీప్ కుమార్ రైతులకు సూచించారు. రెబ్బనలో ఆయన మాట్లాడుతూ పంట వ్యర్థాలను కాల్చడం వల్ల నేల సారహీనంగా మారి పర్యావరణానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని హెచ్చరించారు. గడ్డిని తగలబెట్టడం వల్ల భూమిలోని విలువైన సేంద్రియ కార్బన్ నశించి నీటి నిలుపుదల సామర్థ్యం తగ్గుతుందన్నారు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా నత్రజని స్థాపనకు, పోషకాల చక్రానికి తోడ్పడే ప్రయోజనకరమైన బ్యాక్టీరియా, శిలీంధ్రాలు, వానపాములు వంటి సూక్ష్మ జీవులు చనిపోయి నేల ఉత్పాదకత క్షీణిస్తుందని వివరించారు. నత్రజని, గంధకం, ఫాస్ఫరస్, పొటాషియం వంటి ప్రధాన పోషకాలు నష్టపోవడం వల్ల రసాయన ఎరువులపై ఆధారపడటం పెరుగుతుందన్నారు. నేల గట్టిగా మారి వేర్ల పెరుగుదల దెబ్బతింటుందని, వాయు కాలుష్యం ఏర్పడి మానవులలో శ్వాసకోశ




సమస్యలు వస్తాయని పేర్కొన్నారు. రైతులు పంట గడ్డిని కాల్చడానికి బదులుగా మెరుగైన ప్రత్యామ్నాయ పద్ధతులు పాటించాలని వ్యవసాయాధికారి కోరారు. మల్చింగ్ చేయడం, సేంద్రియ ఎరువుగా మార్చడం లేదా మట్టిలోనే కలియదున్నడం వల్ల నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని తెలిపారు. హ్యాపీ సీడర్, సూపర్ సీడర్ వంటి ఆధునిక యంత్రాలను వాడి వ్యర్థాలను కాల్చకుండానే నేరుగా విత్తనాలు వేసుకోవచ్చన్నారు. బయో డీకంపోజర్ స్ప్రేలను ఉపయోగించి పంట అవశేషాలు సహజంగా, వేగంగా కుళ్ళిపోయేలా చేయవచ్చని సూచించారు. స్వల్పకాలిక లాభం కోసం గడ్డిని కాల్చకుండా సుస్థిరమైన యాజమాన్య పద్ధతులను పాటించి నేల సారాన్ని, పంట ఉత్పాదకతను కాపాడుకోవాలని కోరారు.

# గని విస్తరణకు కీలక ముందడుగు

### అటవీ పెంపకానికి భూముల పరిశీలన

**ప్రజాపక్షం / మందమర్రిః** మందమర్రి ఏరియాలో ప్రతిపాదిత రామకృష్ణాపూర్ ఉపరితల గని విస్తరణకు సంబంధించి అటవీ భూమి వినియోగానికి బదులుగా చేపట్టాల్సిన పరిహార అటవీ పెంపకం కోసం అనువైన అటవీయేతర భూముల పరిశీలన ప్రక్రియ వేగవంతమైంది. ఈ నేపథ్యంలో జిల్లా అటవీ అధికారి రాహుల్ కిషన్ జాదవ్, సింగరేణి ఉన్నతాధికారులతో కలిసి ప్రతిపాదిత స్థలాన్ని శుక్రవారం సమగ్రంగా పరిశీలించారు. పరిహార అటవీ పెంపకానికి శ్రీరాంపూర్ ఏరియాలోని శ్రీరాంపూర్ ఉపరితల గని డంప్ యార్డ్ అవసరాల కోసం సింగపూర్ గ్రామ పరిధిలో సింగరేణి సంస్థ సేకరించిన భూమిని ప్రతిపాదించారు. ఈ భూమి భౌగోళిక పరిస్థితులు, విస్తీర్ణం, మట్టి నాణ్యత, నీటి వనరుల లభ్యత, భవిష్యత్ అటవీ అభివృద్ధికి ఉన్న అవకాశాలను అటవీ, సింగరేణి బృందం క్షుణ్ణంగా పరిశీలించింది. ఈ పరిశీలనలో మందమర్రి



ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ ఆధ్వర్యంలో అధికారులు పాల్గొని, ప్రభుత్వ నిబంధనలు, పర్యావరణ ప్రమాణాలు, అటవీ శాఖ మార్గదర్శకాలకు అనుగుణంగా తదుపరి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. అనంతరం అటవీ శాఖ అధికారులు భూమి అనుకూలతపై తమ సాంకేతిక అభిప్రాయాలను వెల్లడించారు. పర్యావరణ సమతుల్యతకు భంగం కలగకుండా, చట్టపరమైన అన్ని అనుమతులు పొందిన తర్వాతే గని విస్తరణ పనులు కొనసాగిస్తామని సింగరేణి అధికారులు స్పష్టం చేశారు.

## సైడ్ డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/వాంకిడిః** వాంకిడి మండలంలోని బంబార గ్రామపంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీ నుంచి హైవే రోడ్డు వరకు మంజూరైన సైడ్ డ్రెయిన్ నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గుర్నులే నారాయణ ముఖ్య అతిథిగా హాజరై పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ బెండారే కృష్ణాజీ మాట్లాడుతూ ఎస్సీ కాలనీలో వర్షాకాలంలో నీరు నిల్వ ఉండే సమస్యకు ఈ సైడ్ డ్రెయిన్ నిర్మాణంతో శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. గుర్నులే నారాయణ మాట్లాడుతూ



ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో గ్రామాలను అభివృద్ధి చేయాలని సూచించారు. శాలమ్మ, పొన్నాల వెంకటి, లోబడే బాబురావు, లోబడే తిరుపతి, మాండోకర్ మల్లయ్య, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.


# గల్ఫ్ కార్మికుల మానవతా దృక్పథం



**ప్రజాపక్షం/జన్నారం :** అనారోగ్యంతో మృతి చెందిన ఒడ్డేటి మల్లేష్ కుటుంబానికి రోటిగూడ గల్ఫ్ కార్మికులు 32,500 రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. జన్నారం మండలంలోని రోటిగూడ గ్రామానికి చెందిన మల్లేష్ ఇటీవల అనారోగ్యంతో మరణించడంతో నలుగురు ఆడపిల్లలు ఉన్న ఆయన కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో పడింది. ఈ విషయం తెలుసుకున్న గల్ఫ్ కార్మికుడు ఉప్పు సురేష్ అక్కడి తోటి కార్మికుల దృష్టికి తీసుకెళ్లడంతో వారు వెంటనే స్పందించి సహాయ నిధిని సమీకరించారు. జమ చేసిన మొత్తాన్ని మల్లేష్ భార్యకు అందజేసి అండగా నిలిచారు. ఈ సందర్భంగా గల్ఫ్ కార్మికులు మాట్లాడుతూ మల్లేష్ కుటుంబానికి సహాయం చేయడం తమ సామాజిక బాధ్యతని, భవిష్యత్తులోనూ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తామని తెలిపారు. రోటిగూడ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి వ్యవస్థాపకుడు సేపూరి గోపాల్, అధ్యక్షుడు ఉప్పు తిరుపతి, ఉపాధ్యక్షుడు పులిశెట్టి లవన్ కుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్ పాలాజీ శ్రీనివాస్, అకౌంటెంట్ ఉప్పు మల్లేశం, ప్రచార కార్యదర్శి ఒడ్డేటి రమేష్, సలహాదారులు ఉప్పు కిరణ్, ఉప్పు నరేష్, పులిశెట్టి భగత్ పాల్గొన్నారు.

# హైటెక్ యశోద ఆసుపత్రికి ప్లాటినం అవార్డు

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** ప్రపంచస్థాయి ట్రాన్స్ ప్లాంట్ కేర్ ఎయిర్ అంబులెన్స్ సేవలతో భారతదేశంలో ఏకైక ప్లాటిన్ సర్టిఫైడ్ ఇసిఎంఓ సెంటర్‌గా హైదరాబాద్ యశోదా ఆసుపత్రి నిలిచిందని ఈ విభాగంగాలో ప్లానిటం అవార్డు సాధించడం అభినందనీయమని యశోద ఆసుపత్రి క్రిటికల్ కేర్ క్లినికల్ డైరెక్టర్ డాక్టర్ వెంకట్‌రామన్ కోలా అన్నారు.




శుక్రవారం మంచిర్యాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ, ఇసిఎంఓ ద్వారా గుండె, ఊపిరితిత్తుల వైఫల్యం వంటి అత్యంత తీవ్రమైన పరిస్థితులలో రోగుల ప్రాణాలను కాపాడటానికి ఉపయోగించే అధునాథన సాంకేతికత ఈపిసిఆర్ కు స్పందించిన సందర్భాలలో ఇసిఎంఓ ఒక ప్రత్యామ్నాయంగా పనిచేస్తుందని అన్నారు. యశోదా ఆసుపత్రిలో రెండు వందల పడకలు ప్రత్యేకంగా ఇన్ఫెక్షన్ వేరువేరుగా ఏర్పాటు చేయబడ్డాయని ఇది రోగులు వేగంగా కోరుకోవడానికి దోహదపడుతుందని వివరించారు. ఈ సమావేశంలో యశోదా హైటెక్ సిటి ఆసుపత్రి ఆసిస్టెంట్ మనేజర్ పాలకుర్తి నవీన్ పాల్గొన్నారు.

# రైతుల రక్షణే లక్ష్యం

**ప్రజాపక్షం/మందమర్రిః** మండలంలో రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందేలా చూసేందుకు అధికారులు చర్యలు వేగవంతం చేశారు. శుక్రవారం మండల వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రెవెన్యూ, పోలీస్ అధికారులతో కలిసి మండల పరిధిలోని విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల సందర్భంగా దుకాణాలలో నిల్వ ఉంచిన ఉత్పత్తుల నాణ్యతను పరిశీలించడంతో పాటు స్టాక్ రిజిస్టర్లు, బిల్లులు, లైసెన్సులు, ధరల పట్టికలను అధికారులు పరిశీలించారు. రైతులకు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు అందించాలని దుకాణదారులకు స్పష్టం చేశారు. అనుమతి లేకుండా విక్రయాలు నిర్వహించడం, అధిక ధరలకు అమ్మడం, నకిలీ లేదా గడువు ముగిసిన ఉత్పత్తులను విక్రయించడం వంటి అక్రమాలకు పాల్పడితే కఠిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. రైతులు వ్యవసాయ ఉత్పత్తులు కొనుగోలు చేసే సమయంలో తప్పనిసరిగా రశీదులు తీసుకోవాలని, ఎలాంటి అవకతవకలు గమనించినా వెంటనే వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ తనిఖీ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి జి. కిరణ్మయి, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గణపతి, సహాయ సబ్ ఇన్స్పెక్టర్ రవీందర్, వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.